# సంపాదకీయం



సృష్టిలో సృజింపబడిన ప్రతిదానికి ఒక నిర్ధిష్టమైన సమయం ఉంటుంది. సృజింపబడినది నాశనం అవ్వకుండా ఉండడం మనం వినలేదు, చూడలేదు కూడా. జీవితం శాశ్వతం కాదని తెలిసినా, మరణాన్ని తప్పించుకొని బ్రతకాలనే కొండంత ఆశతో ఉంటాడు మనిషి. కష్ట, సుఖాల సమ్మేళనంలో మరణం ముగింపు పలికినపుడు దుఃఖానికి గురిఅవుతున్నాడు. ఈ మరణానికి ధనిక,పేద, విధ్యావంతులు, పామరులు అనే తేడా లేదు. అందరికి ప్రాప్తిస్తుందనే సత్యాన్ని నమ్మలేకపోతున్నాడు.

మరణము అశాశ్వతమైన మానవ ఉనికిని, క్షణబంగురమైన జీవితాన్ని గుర్తుచేస్తుంది. కష్టాలు, బాధలు, క్షీణించే ఈ దేహము, మరణము ఇవన్నీ మానవ జీవితం ఎంత దుర్భరమో తెలియజేస్తాయి. కాని క్రీస్తునందు విశ్వాసం, మరణం పట్ల ఒక నూతన అవగాహన ఇస్తుంది. క్రీస్తును నమ్ముకున్న వారికి మరణము ఈలోక జీవితానికి అంతమే అయినా, పరలోక జీవితానికి అది ద్వారము. పాపానికి వచ్చిన శిక్ష మరణము. అయితే క్రీస్తు పాపమును, మరణమును జయించినందున, ఆయనను విశ్వసించు వారు శారీరక మరణం అనంతరం నిత్యజీవితాన్ని పొందుతారు.

**మరణంపై ధ్యానమునకు కొన్ని బైబిలు వాక్యాలు :**

ఆదికాండం: 3/19 – మట్టినుండి వచ్చిన..
సొలోమోను జ్ఞాన గ్రంథం: 1/13 – మృత్యువును దేవుడు కలిగింపలేదు.
సొలోమోను జ్ఞాన గ్రంథం: 2/24 – పిశాచము అసూయ వలన మరణము ఈ లోకానికి వచ్చెను.
దర్శన గ్రంథం: 14/13 – ప్రభుసేవలో మరణించు వారు ధన్యులు.
కీర్తన 116/15 – భక్తిమంతుల మరణం దేవుని దృష్టికి విలువ గలది.
2 కొరింతి 5/1 – మన శాశ్వత గృహం – పరలోకం.
రోమీయులకు 8/11 – క్రీస్తు భక్తులు మరణం ద్వారా నిత్య జీవంలో ప్రవేశిస్తారు.

**దైవ, మానవ సేవలో అసువులు బాసిన పూజ్య గురువులకు అశ్రునివాళి :**

మమ్ము వీడి అనంత లోకానికేగిన పూజ్యగురువులారా! సువార్త పరిచర్యలో...

స్నేహమనే చిరుగాలితో ప్రశాంత పరచారు.
ఎడబాటు అనే వడగాలితో ఉక్కిరిబిక్కిరి చేశారు.
గలగలాపారే సెలయేరులా చిరునవ్వుతో పలకరించారు.
మండుటెండలో ఎండమావుల్లా కనుమరుగైనారు.

జీవితమనే యుద్ధ భూమిలో ఓడిపోయారు.
మరణమనే పరుగు పందెంలో గెలిచారు.
పారే సెలయేటిలో గలగలా కలసిపోయారు.
కదిలేకాలంలో చెరగని ముద్రగా మిగిలిపోయారు.

మీతో స్నేహం చేయాలనిఉంది ఈ జన్మలో
చేయి విడచి వెళ్ళిపోయారు మరోజన్మకు.
చిరునవ్వుతో పలకరించాలని ఉంది
కన్నీరు మిగిల్చి కనుచూపుమేరకు కనుమరుగైనారు.

జీవమైన క్రీస్తు, మీకు నిత్యజీవితాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ.... కన్నీటితో.....

Fr. Vkumar..

ఫా. దామాల విజయ కుమార్
ఎడిటర్

# సకల పునీతుల పండుగ
# 01-11-2017

***దర్శన 7:2-4,9-14 1యోహాను3:1-3 మత్తయి 5:1-12***

అన్నికాలాల్లోను, స్థలాల్లోను పుట్టి, గిట్టి మోక్షవాసం చేరిన పుణ్యాత్ముల పండుగ.

క్రైస్తవ శ్రీసభ చరిత్రలో సకల పునీతులు అనగా పునీత పట్టా ఇవ్వబడినా, ఇవ్వబడకున్నా పరలోకంలో దేవుని సమక్షంలో సంతోషంగా ఉన్నవారందరిని స్మరించుకొను పండుగను క్రీ॥శ॥ 5 లేక 6 శతాబ్దంలో కొనియాడబడినట్లు తెలుస్తుంది. మన బంధువులు, స్నేహితులు తెలియని లెక్కలేనంతమంది అన్నికాలాల్లో, స్థలాల్లో వేష భాషల్లోని ప్రజలు మోక్షరాజ్యంలో ప్రభు సింహాసనం ముందు ఆనంద స్తుతిగానాలతో జీవిస్తున్న ఆత్మలువారు. దేవుని అపారమైన అద్భుత కృపావరములవల్ల ఆ ఆత్మలు తమ నిత్య జీవ గృహంకు, అనంత దేవానంద సాగరంకు చేరుకున్నాయి. వారిని జ్ఞాపక పరచుకునే పండుగే ఈ రోజు.

ఈ లోకంలో జీవిస్తున్న మనం సంపూర్ణ సంతోష స్థితిగల దైవరాజ్యంలోని ఆత్మలతో సఖ్యత కలిగిఉన్నాం. క్రైస్తవులు తమ విశ్వాస ప్రకటనలో "పునీతుల సంబంధ ప్రయోజనమును విశ్వసించుచున్నాను" అని చెప్పుచున్నారు. నిజమే మనం సత్యోపదేశంలో ఈ లోకంలో ఉన్నవారం యుద్ధ సభ అని ఉత్తరించి స్థలంలో ఆత్మలు ఉత్తరించుసభ అని మోక్షం స్వతంత్రించుకొన్న వారిని జయసభ అని నేర్చుకున్నాం. ఈ మూడు సభలు కలిస్తేనే విశ్వ శ్రీసభ అవుతుంది. ఈ సభలు ఒకరికొకరు సంబంధం కలిగి దైవ ప్రేమలో, కృపలో భాగస్తులై ఒక కుటుంబంగా భావించాలి. ఒక కుటుంబంలోని సభ్యులు ఎలాంటి సహాయ సహకారాలు అందించుకొంటు జీవిస్తుంటారో సామాన్యులకు కూడ ఎరుకే కదా..!

ఇటువంటి సఖ్యత, బాంధవ్యంను బట్టి దైవరాజ్యంలోని పునీతులు మనల్నికూడ వారి అడుగుజాడల్లో నడచి ప్రభుమార్గంలో పైకిరావాలని శక్తివంచన లేకుండా తమ

ప్రార్థనల్ని విన్నపాల్ని ప్రభువుకు అప్పగిస్తారనడంలో సందేహంలేదు. తండ్రి గృహం చేరుకొన ముందుగా వెళ్ళినవారు దైవ బిడ్డలైన మనల్ని అపమార్గం పోవ సహింపగలరా? కుటుంబ సభ్యులందరు ప్రభువు మోక్ష గొడుగు క్రిందకు చేర ప్రయత్నింపరా!

"పరదేశంలో ఉన్న మనల్ని స్వదేశంలోని స్వగృహంకు చేరి తండ్రిని స్తుతించి ఆరాధిస్తూ సంతోషించేందుకు పునీతులు సదా మనల్ని స్వాగతిస్తూనే ఉంటారు. ప్రభువు ద్వారా, ప్రభువుతో, ప్రభువుయందు ఉండేందుకై మనకోసం ఆ పునీతులు మధ్యవర్తుల్లా ఎల్లప్పుడు దేవాదిదేవుని వేడుకుంటూనే ఉంటారు. వారి శ్రద్ధ మన బలహీనతల్లో ఎంతో సహాయకారి కాగలదు" అని 6వ పౌలు పోపుగారు శ్రీసభకు సందేశం యిచ్చి ఉన్నారు.

సకల పునీతుల పండుగ మన విశ్వాస నేత్రాలను పైకి త్రిప్పుతుంది. పునీతుల జీవిత సాక్ష్యాలనే గొప్ప మేఘంవైపుకు త్రిప్పుతుంది. ఆ క్రీస్తు సాక్షులు దేవునితో కలసి నివాసమున్నారు. మనతో కూడా ఉన్నారు. వారు ఇచ్చిన సాక్ష్యం, చూపిన ప్రేమ, చేసిన ప్రోత్సాహం, కలిగించిన ప్రేరణ మనతో ఉంది. దైవరాజ్య ప్రయాణంలో వారు మనల్ని బహుగా ఆకర్షిస్తున్నారు అని మరువకూడదు. ఆత్మలన్నిటికి పరిపూర్ణతను ప్రసాదించి, హెచ్చించి వారిని దేవుని మహిమలోకి ప్రవేశింప యోగ్యత కలిగించేది స్వయంగా పవిత్రాత్మ సర్వేశ్వరుడే. ఇక్కడ మనం గ్రహించాల్సింది ఏమిటంటే క్రీస్తు పరమ దేవరహస్యాల్ని క్రోడీకరించి ఏడాది పొడవునా గుర్తుచేసి కొనియాడచేసిన శ్రీసభ ఈ సకల పునీతుల పండుగరోజున క్రీస్తు సిలువ విజయపు ఫలాన్ని గుర్తుచేస్తుంది. పునీతులను సాధించుకున్న ప్రభువును కొనియాడుతోంది. పరిశుద్ధతకు మారుపేరు మన రక్షకుడైన క్రీస్తు. పాపదోషంపై పరిశుద్ధ విజయం సాధించి మనకు విజయం సాధించిపెట్టింది క్రీస్తు కృపయే. అనగా క్రీస్తు అద్వితీయ ప్రేమ జీవితమే. అదే విముక్తికి మూలం. క్రీస్తు పిలుపుకు అర్థం ఏమిటి? బప్తిస్మ యోహానుగారి మాటల్లో "ఆయన హెచ్చింపబడవలెను. నేను తగ్గింపబడవలెను. పునీత పౌలు అంటున్నారుకదా!" "ఇక జీవించునది నేనుకాదు. క్రీస్తే నాయందు జీవించుచున్నాడు". ఈ పండగ రోజున ఈ మాటలు మనకు శిరోధార్యమని పునరుద్ఘాటించుకోవాలి.

ఇకపోతే, శ్రీసభ బోధించినట్లు పునీతులతో మనకు సంబంధము కలిగి ఉండటం వలన వారి మధ్యవర్తిత్వాన ప్రార్థన తగినదేనా? అని పునీత థామస్ అక్వినాస్‌గారు ప్రశ్నిస్తున్నారు. అందుకు వారే ఇలా జవాబిస్తున్నారు. "దేవుని చట్టంప్రకారం మనం పునీతుల హస్తాల మీదుగా ప్రభువు చెంతకు చేరాలి. వారి ద్వారా ప్రభువు పరలోక పుణ్యాల్ని, వరాల్ని క్రుమ్మరిస్తున్నారు. పునీతుల మధ్యవర్తిత్వాన ప్రభువైన దేవుడు తమ ఆశీర్వాదాలను మనకు అందిస్తున్నారు. తిరిగి మనం అదే మార్గాన ప్రభువును చేరాల్సి ఉంది. దేవుడు ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా మనల్ని అభిషేకిస్తున్నారని కాదు. కాని ప్రభువు చేసిన సృష్టిలో తాను ఏర్పరచిన క్రమం చొప్పున నడచుకొన ప్రతిదానికి రెండవ విషయంపై లేక వస్తువుపై ఆధారపడే ద్వితీయ కారణాల్ని ఏర్పరచి ఉన్నాడు. కాని క్రింద ఉన్నవారు పై ఉన్నవారిని వేడుకొనుట ద్వారా మోక్షాన్ని పొందగలరు". "దైవప్రేమను తెలిసికోవడంలోనే పునీతులయొక్క గొప్పతనం శాస్త్రం ఆదారపడి ఉంది.

"పరిశుద్ధతను సాధించాలనే కోరిక తన హృదయంలో లేకున్నట్లయితే అతడు క్రైస్తవుడై కాని అతడు ఉత్తమ క్రైస్తవుడు కానేరడు" అంటున్నారు పునీత అల్ఫోన్సుస్‌గారు. "ప్రభువైన దేవుడు అసాధ్యమైనదేదీ మననుండి కోరడంలేదు. మనకు చేతనైన మంచినే చేయమని జాగ్రత్తలు లేక బుద్ధి చెప్పడం దేవుని నీతిసూత్రం. అసాధ్యమనుకున్న మంచికి సుసాధ్యం చేసుకొన ప్రయత్నించమని దేవుడు మనల్ని కోరుతున్నాడు. అన్నింటిని సాధించుకోగలగడానికే, లేక నెరవేర్చుకో కలగడానికే దేవుడు సాయమందిస్తుంటాడు" అని ట్రెంటు మహాసభ వాక్కాణించింది.

"ఈ జీవితంలోకూడ ప్రతి మంచి ఆశకు లేక ఆశయానికి దేవుడు ప్రతిఫల మిస్తుంటాడు" అని పునీత అవిలా తెరేసమ్మగారు నడువుతున్నారు. "దేవునిపట్ల మనకు ఇష్టం లేకుండా లేక సుణుగుకుంటూ పనులుచేస్తే. దేవుడు మనపట్ల ఔదార్యంతో దాతృత్వంతోనుండ ఎలా ఆశించగలం?" అని పునీత అల్ఫోన్సుస్‌గారు ప్రశ్నిస్తున్నారు.

క్రీస్తు ప్రేమకోసం, సాక్ష్యంకోసం ఎందరో పుణ్యాత్ములు అనేక ప్రదేశాల్లో అనేక విదాల హింసింపబడి వధింపబడ్డారు. అట్టి హతసాక్షులు సంస్మరణకోసం నాలుగవ

శతాబ్దం నుండే ఏడాదిలో ఒక రోజును నిర్ణయించి పండగ కొనియాడబడుతుండేదని పునీత ఎఫ్రేము, పునీత జాన్ క్రిసోస్తంగార్లు చెప్పియున్నారు. అయితే 8వ శతాబ్దంనుండి నవంబరు1వ తేదీన రోమునగరంలో సకల పునీతుల పండుగ జరుపుకొనబడగా 4వ గ్రెగోరి పోపుగారు ఆ మరుసటి శతాబ్దం నుండి శ్రీసభ అంతట ఈ ఉత్సవాన్ని జరుపుకోన ఆచారం చేశారు. ఈ పండుగ రోజున ప్రతి విచారణ గురువు తమ విచారణ క్రైస్తవులందరి కొరకు దివ్యబలిపూజను అర్పిచడం ఆనవాయితి. ఈ సందర్భంలో "ఈ లోకంలో మరణం అనగా పరలోకంలో జననం అని అర్థం." అని మన గురువులు చెప్తుంటారు. అందుకే పునీతుల మరణదినంరోజున మనం వారి పండుగ చేస్తుంటాము.

సువార్తా గ్రంథంలో మత్తయి 5:3-12 మరియు లూకా 6:20-23 వరకు యేసు చెప్పిన కొండమీది ప్రసంగం పూర్తిగా ఎటువంటివారికి మోక్షప్రాప్తి ఉందో గ్రహింపగలం. అలాగే పునీత యూదా వ్రాసిన లేఖ 8వ వచనంలో "పైనున్న దివ్య జీవులను అవమానింతురు". అని 'పునీతుల సంబంధం ప్రయోజనంను విశ్వసింపని' అజ్ఞానులపై విరుచుకుపడ్డారు. తిరిగి 22,23 వచనాల్లో అట్టివారిపై దయచూపుడని వారిని రక్షింప ప్రయత్నింపుడని తమ మాటగా హితవు చెప్తున్నారు మనకు. మత్తయి 25:31-46 తెలుసుకొని, లూకా 22:43లో ప్రకారం "నేడే నీవు నాతోకూడా పరలోకమున ప్రవేశించెదవు" అని యేసు చెప్పిరి. కావున మనం నిత్య జీవం పొందగోరెదము. కేవలం ఈ తాత్కాలిక జీవితం ఫలించుకుని.

ధ్యానాంశం:

పరుగెత్తు! నీవు నీ పరిశుద్ధతను సాధించుకోగలవేమో! ఇది దేవుని చిత్తం! (పునీత పౌలు)

# ఉత్తరించు ఆత్మల పండుగ
# 02-11-2017

నవంబరు మొదటి తేదీన జయసభ అనగా మోక్షంలో శ్రీసభ విజయోత్సవంను ఇక్కడ మనం కొనియాడుతున్నాం. ఆ మరుసటి రోజే అనగా నవంబరు 2వ తేదీన యుద్ధసభ అనగా ఈలోకంలోని విశ్వాస క్రైస్తవులు ఉత్తరించు సభ లేక స్థలంలో బాధను అనుభవిస్తున్న మరియు తమ పాపములన్నీ పరిహరింపబడే వరకూ అనగా ఆ స్థితిని దాటిపోయేవరకు వేచి ఉండాల్సిన బాధను పొందుచున్న మానవుల ఆత్మల సత్వర విముక్తికై దేవుని ప్రత్యేకంగా వేడుకునే పండుగను జరుపుకుంటున్నాం. ఆ విధంగా సకల పునీతులతో, ఉత్తరించు ఆత్మలతో మనకు గల అసాధారణ, అస్వాభావిక బాంధవ్యమును తద్వారా సఖ్యతను, బాధ్యతను శ్రీసభ ప్రకటింపజేస్తుంది. అనగా మోక్షంలోని విజయ క్రైస్తవులు, ఉత్తరించు స్థలంలోని బాధామయ క్రైస్తవులు భూలోకంలోని యుద్ధరంగ క్రైస్తవులు ఒకరినొకరు ప్రార్థించుకొని ఫలభరితులౌతారని. దైవ కుటుంబంగా అలరారుతారని శ్రీసభ బోధిస్తుంది.

విశ్వాసులయొక్క ప్రార్థనలు, త్యాగక్రియలు ముఖ్యంగా దివ్యబలి పూజార్పణల ద్వారా ఈ ఉత్తరించు ఆత్మల సత్వర విముక్తికై అవసరమని ట్రెంటు మహాసభ వెల్లడించింది. ఈ ఉత్తరించు స్థలంలోని ఆత్మలకు స్వయం సహాయం, లేక వేరే ఆత్మలకు సహాయంచేసే శక్తి ఉండదు. అందుకే వారిని దిక్కులేని ఆత్మలు అంటాం. కాని పరలోకంలో నివశిస్తున్న ఆత్మలు, భూలోకంలో జీవిస్తున్న మానవులు దేవుని ప్రార్థించి బ్రతిమాలుకొని ఆయా ఉత్తరించు ఆత్మల బాదామయ కాలాన్ని తగ్గింపగలిగేలా చేయనగును. క్షమింపబడదగిన పాపాలన్నీ పరిహరింపబడి, అందుకు తగిన బాధలన్నీ భరించి ఈ ఉత్తరించు ఆత్మలు ప్రక్షాళణ అయిన పిమ్మట మాత్రమే విముక్తి లభించి దేవుని రాజ్యంలోకి ప్రవేశింప కలుగుతాయి. వారి పాప విమోచనకై తగిన స్వల్ప కాలిక శిక్ష ముగించుకొని పశ్చాత్తాపాన్ని పొంది పాపబంధం నుండి ఉత్తరించు స్థితినుండి విడుదలైన పిమ్మట దేవుని కృపవల్ల పరిశుద్ధ పరిపూర్ణత లభించి దేవయిష్ట ప్రసాదం కలిగి ఆ యాత్మలు మోక్షం చేరుకోగలుగుతాయి. కనుక ఉత్తరించు స్థలంను శుద్ధీకరణ స్థలం, ప్రాయశ్చిత్త స్థలం అని పిలుస్తాము.

5వ శతాబ్దంనుండే ఈ ఉత్తరించు ఆత్మలు నిత్య విశ్రాంతి పొందుటకై ప్రార్థనలు

దివ్యబలిపూజలు అర్పించే సంప్రదాయం ఉంది. కాని 'పునీత క్లూని ఒడిలో' వారి కృషివల్ల 10వ శతాబ్దం నుండి ఈ సంప్రదాయం ప్రపంచ నలుమూలలకు వ్యాపించింది.

మొదటి ప్రపంచయుద్ధంలో అసంఖ్యాకమైన సైనికులు ప్రజలు ప్రాణాలు వదిలారు. ఈ సందర్భంగా క్రీ॥శ॥ 1915లో 15వ బెనెడిక్టు పోపుగారు ప్రతి గురువు ఈ ఉత్తరించు ఆత్మల పండుగరోజున మూడు దివ్యబలిపూజలు చేయ అనుమతి మంజూరుచేశారు. మొదటిపూజ వేదనలననుభవిస్తున్న ఉత్తరించు స్థల ఆత్మల నిత్య విశ్రాంతికోసం, రెండవపూజ పరిశుద్ధ జగద్గురువు (పోపుగారి) ప్రత్యేక మరియు పొత్తు తలంపుల నెరవేర్పుకు, మూడవది మరియు ఆఖరిపూజకు గురువుయొక్క సొంత తలంపు కొరకును అర్పింప సెలవిచ్చారు. ఈ పూజలు అర్పించుటకు ముందు చనిపోయిన ఆయా వ్యక్తుల పేర్లు చెప్పి వారి ఆత్మల నిత్య విశ్రాంతికోసమని, ఉత్తరించు స్థలంనుండి విమోచింపుమని ప్రభువును వేడుకొంటూ గురువులు పూజలు సమర్పింప సెలవు పొందియున్నారు.

కతోలిక ఆచారము చొప్పున విశ్వాసుల విన్నప ప్రార్థనలు సల్పుట, సామాధుల స్థలాన్ని సందర్శించి ప్రత్యేక జపాలు, పాటలు మధ్య తీర్థజలాలతో సమాధులను ఆశీర్వదించడం జరుగుతుంది. కొన్నిదేశాల్లో విశ్వాసులు, ప్రదక్షిణగా సాయంకాలం సమాధుల వద్దకువెళ్ళి ప్రార్థనలు చేసుకుంటు కొవ్వొత్తుల, దీపాలు వెలిగిస్తారు. అవి వెలిగినంతసేపు రాత్రుళ్ళు సందోర్భోచిత గుర్తుగా వెలుగుతూనే ఉంటాయి.

ఉత్తరించెడి దిక్కులేని ఆత్మల విముక్తికోసం భక్తి ప్రదర్శించడంను ఒక గొప్ప క్రైస్తవ దాతృత్వంకు గుర్తుయని ప్రజలు కీర్తింస్తుంటారు. ఈ విషయంలో పునీత లియోనార్డుగారు "ఉత్తరించు స్థలంనుండి ఒక ఆత్మను నీవు విముక్తం చేయగలిగితే ఇక మోక్షం నీ చేతిలో ఉందని నమ్ము" అని బల్లగుద్ది చెప్తున్నారు. చనిపోయిన వార్లను ప్రార్థనా పూర్వకంగా మనం జ్ఞాపక పరచుకుంటే, దేవుడు మన తలంపును ఆశాబావాన్ని బలపరుస్తాడు. తద్వారా మనలను వీడిన మన సహోదరీ సహోదరులు క్రీస్తు పునరుత్థాన భాగ్యలో తప్పక పాలుపంచుకొంటారు.

"యేసుప్రభుని దివ్య జ్ఞాన శరీరమైన భూలోక శ్రీసభ మరణించినవారిపట్ల పూర్తి గౌరవంతో ఘనంగా స్మరించుకుంటుంది. భక్తితో మరణించినవారు యోగ్యమైన బహుమతిని పొందుదురని నమ్ముతుంది. నమ్మి ప్రార్థించినచో ఆ ఆత్మలు పాపవిముక్తి పొందుదురు. అని విశ్వసిస్తుంది. తన కష్టాలు శ్రమలు అన్నీ ఈ దిక్కులేని ఆత్మలకోసం సమర్పించుకుంటుంది." అని 2వ వాటికను కౌన్సిలు మనవిచేసింది.

# సామాన్య 31వ ఆదివారం
# 05-11-2017

***మలాకి 1:14-2:2,8-10 1తెస్స 2:7-9,13 మత్తయి 23:1-12***

యేసుక్రీస్తును మించిన సత్య బోధకులు లోకంలో వేరొకరు మనకు కనిపించరు. దైవరాజ్యానికి సాగే మహాప్రస్థానంలో మన అవసరాలేమిటో, మనకు ఆవశ్యకమైనవేమిటో పూర్తిగా తెలిసినవారు ప్రభువు ఒక్కరే. అలాగే మనలో కొలువుదీరి ఉండే పవిత్రాత్మ దైవసంకల్పాన్ని తెలుసుకోవడానికీ, దానిని తూచ తప్పక పాటించడానికీ ఆవసరమైన శక్తిని మనకు ప్రసాదిస్తున్నారు. అంతేకాదు కతోలిక క్రైస్తవులమైన మనం దివ్యసత్ప్రసాదం ద్వారా నిరంతరమూ పవిత్రాత్మ దివ్యశక్తిని పొందగలుగుతున్నాం, తండ్రి దేవునికి తగిన సంతానంగా జీవించగలుగుతున్నాం.

**మొదటిపఠనం : మలాకీ 1:14-2:2,8-10**

మలాకీ గ్రంథాన్ని క్రీస్తుపూర్వం 450లో రాశారు. ఈ గ్రంథ రచయిత ఎవరో స్పష్టంగా తెలియదు. కనుకనే గ్రంథ మూల భాషలోని "మలాకీ" అనే పదబంధాన్ని బట్టి, గ్రంథకర్తను మలాకీ అనే పేరుతో పిలవడం ఆనవాయితిగా వస్తోంది.

యెరూషలేము దేవాలయాన్ని పునర్నిర్మించాక, ఆలయంలో అర్పిస్తోన్న బలియాగాదుల్లో జరుగుతోన్న అవకతవకలను అక్రమాలను ఖండించడానికే ఈ గ్రంథ రచన చేశారు.

మలాకీ గ్రంథంలో ఆరుభాగాలున్నాయి. ఒక్కొక్క భాగంలో యాజకులు చేస్తోన్న అక్రమాలలో ఒకటో రెండింటినో ఎత్తిచూపి తీవ్రంగా ఖండించారు.

ఈనాటి మొదటి పఠనంలో దేవుడు ఇస్రాయేలీ యాజకులు తనను "తండ్రి" గా గుర్తించడం లేదనీ, తన సత్యోపదేశాలను, తాను నిర్దేశించిన జీవన మార్గాలను ప్రజలకు బోధించడం లేదనీ తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. కేవలం ఆరోపణలు చేయడమే కాదు, వారు చేస్తోన్న అపరాధాల పర్యవసానంగా గతంలో తాను లేవీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోబోతున్నట్లు కూడా దేవుడు ప్రకటిస్తున్నారు. లేవీతో చేసుకున్న ఒడంబడిక ప్రకారం, లేవీ ఆతడి తెగవారు మాత్రమే యెరూషలేము దేవాలయంలో అర్చనలు చేయడానికీ తనను సేవించడానికీ యెగ్యులయ్యారు. కానీ ప్రస్తుతం స్వయంగా దేవుడే ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నారు గనుక, ఇకపై లేవీ గోత్రానికి చెందిన యాజకులు దేవుని నామమున ప్రజలను దీవించే అర్హతను కోల్పోతారు.

కానీ ఈ పఠనాన్ని నిశితంగా పరిశీలిస్తే మనకు మరో విషయం కూడా బోధపడుతుంది. అదేమిటంటే లేవీ యాజకులు దేవుని అగౌరవపరచడం వలన దేవునికీ వారికీ మధ్యగల ఒప్పందం రద్దయింది కనుకనే వారలా దేవునిపట్ల అపరాధాలు చేయడానికి పూనుకున్నారన్న భావం కూడా స్పురిస్తుంది.

ఏది ఏమైనా దేవునికీ ఆయన ప్రజలకు మధ్య జరిగిన సీనాయి ఒడంబడికకు భంగం వాటిల్లడం వలననే పూర్వనిబంధనంలోని లేవీయుల యాజకత్వం రద్దయినదని ఈనాటి పఠనం మనకు వెల్లడిస్తోంది.

అంతేకాదు సాక్షాత్తూ దేవుడే తనను తాను "తండ్రీ" అని వెల్లడించుకున్న ఈ మొదటి పఠనం, యేసుప్రభువు దేవుని "తండ్రీ" అని ప్రకటించిన సువార్త పఠనానికి చక్కని ఉపోద్ఘాతమవుతుంది.

**రెండవ పఠనం: 1 తెస్స 2:7-9,13**

పునీతపౌలు మన్నికైన గుడారాల తయారీలో నేర్పరి. తాను ఎక్కడ సువార్తా ప్రబోధం చేసినా, పగటివేళ పనిచేస్తూ, తన కష్టార్జితంతో తాను జీవిస్తూ, రాత్రివేళ వేదప్రబోధం చేసేవాడు. నిజానికి తాను చేస్తోన్న గణనీయమైన సువార్తా సేవలకుగాను తనను పోషించే భారాన్ని, తన వేదప్రచారాలకయ్యే వ్యయాన్నీ ఆయా క్రైస్తవ సంఘాలపై మోపితే ఆక్షేపించేవారెవరూ ఉండరు. కానీ పౌలు అలా చేయలేదు. ఆయన నిరాడంబర జీవనం, స్వావలంబన విధానం ఆయన బోధించే సువార్తా సందేశానికి సజీవ సాక్ష్యాలుగా నిలచేవి. నిజానికి పౌలు నిరాడంబర జీవనానికి సువార్తా విలువలే మూలాధారాలు. సువార్తా విలువలన్నీ ఆచరణ సాధ్యమైన అత్యున్నత జీవన విలువలన్న యథార్థం పౌలు జీవన విధానాన్ని చూచిన వారెవరికైనా బోధపడుతుంది.

ఈనాటి రెండవ పఠనాన్ని పరిశీలిస్తే సామాన్య ప్రజలకు పౌలు సువార్తా ప్రబోధం చేసే హృద్యమైన విధానం వెల్లడవుతుంది. క్రైస్తవ విశ్వాసులపట్ల క్రైస్తవ సంఘాల పట్ల తనను తానొక తల్లిగా భావించుకుంటున్నాడు పౌలు. "పాలిచ్చు తల్లి తన పిల్లల విషయమున ఎంత శ్రద్ధ" వహిస్తుందో, ఎంత మృదువుగా ప్రవర్తిస్తుందో తానూ క్రైస్తవ విశ్వాసులను అలాగే కనుపాపల్లా కన్నబిడ్డల్లా కాపాడుకుంటానని సగర్వంగా చెబుతున్నాడు పౌలు. అవును. తల్లి తన పిల్లల కోసం తన రక్తం చిందించడానికీ, ప్రాణాలు ధారవోయడానికీ కూడా వెనుకాడదు; అయినా వారినుంచి ఎలాంటి ప్రతిఫలమూ ఆశించదు. అలాంటి స్వచ్ఛమైన నిస్వార్థమైన ప్రేమతోనే పౌలు క్రైస్తవ విశ్వాసులను క్రైస్తవ సంఘాలను ఆదరించేవాడు, సేవలు చేసేవాడు; వారిపట్ల గల నిర్మలమైన ప్రేమతోను వారి ఆత్మలను రక్షించాలనే తపతోను పౌలు దేవుని సత్య సువార్తను వారికి బోధించాడు; యేసుక్రీస్తు ప్రభువు ద్వారా దేవుడు తన వాగ్దానాలను

నెరవేర్చిన శుభవర్తమానాన్ని వారికి అందజేశాడు ఆ ప్రయత్నంలోనే అనేక కష్టనష్టాలననుభవించాడు; చివరికి తన ప్రాణాలనే ధారవోయడానికి సిద్ధపడ్డాడు. ఇన్ని చేస్తూ కూడా పౌలు క్రైస్తవుల నుంచిగానీ క్రైస్తవ సంఘాలనుంచి గానీ ఎలాంటి ప్రతిఫలమూ ఆశించలేదు. ఇదే పౌలు అపోస్తోలిక దీక్షకు, సౌవార్తిక నిబద్ధతకూ నిలువుటద్దమవుతుంది.

## సువార్త పఠనం మత్తయి 23:1-12

యేసుప్రభువు వివిధ సందర్భాలలో యూదమత నాయకుల అకృత్యాలను ఖండిస్తూ పలికిన అభిశంసన వచనాలన్నింటినీ పునీత మత్తయి ఒకేచోట ప్రోదిచేశాడు. మత నాయకులను విమర్శిస్తూ ప్రభువు పలికిన మాటలు, ఆనంతరకాలంలో వేద ప్రబోధకులకు క్రైస్తవ నాయకులకు హెచ్చరికలుగా ఉపకరించాయి. వారి దైనందిన జీవితాలకు మార్గదర్శకాలయ్యాయి.

యేసుప్రభువు ముఖ్యంగా మూడు కారణాల వలన యూద మాతాధికారులను ఖండించారు.

**మొదటిది:** ధర్మచట్టానికి మతాధికారులు చెప్పే అవకతవక భాష్యాలు, లోపభూయిష్టమైన వారి బోధనా విధానాలు. నిజానికి ప్రజలు పాటించవలసిన "ప్రధానమైన ఆజ్ఞ – 'నీ దేవుడైన ప్రభువును నీవు పూర్ణహృదయముతోను, పూర్ణాత్మతోను, పూర్ణమనస్సుతోను ప్రేమించవలెను' అనునది, దానితోపాటు పది ఆజ్ఞలూ మాత్రమే. అయితే వీటినుంచి యూదమత నాయకులు 618 చట్టాలను సంప్రదాయాలను రూపొందించి ప్రజలపై మోపారు, సామాన్యప్రజల భక్తిజీవనాన్ని దుర్భరం చేశారు.

"వారు మోయసాధ్యముకాని భారములను ప్రజల భుజములపై మోపుదురు కాని, ఆ భారములను మోయువారికి సాయపడుటకు తమ చిటికెన వ్రేలైనను కదపరు". ఇక్కడ యేసుప్రభువు చెప్పిన కీలకమైన ఈ మాటను కొందరు అంతగా పట్టించుకోరు, మరికొందరు అపార్థం చేసుకుంటారు.

ఈ మాటకు అసలైన అర్థమేమిటీ అంటే అవసరం ఉన్నా లేకపోయినా చట్టాలకు ఉపచట్టాలను ఉపోప చట్టాలను చేర్చుతూ చట్టాల సంఖ్యను పెంచె మతనాయకులు, ఆయా చట్టాలకు కట్టుబడి జీవించడంలో ప్రజలకు రవ్వంత సాయం కూడా చేయరు. నిజానికి తమ నాయకత్వంలోగల ప్రజల ఆధ్యాత్మిక అవసరాలేమిటో, దేవుని ఆజ్ఞలను నిష్ఠగా పాటించడానికి వారికి ఏం కావాలో మతనాయకులకు తెలియదు. కానీ ఈ విషయం యేసు ప్రభువుకు తెలుసు.

అవును. దేవుని ఆజ్ఞలను పాటించదలచుకున్న దైవ ప్రజలకు పవిత్రాత్మ శక్తి

కావాలి. ఆ పవిత్రాత్మను సాక్షాత్తూ యేసుప్రభువే తన శిష్యులకు ప్రసాదించి, వారిని శక్తిమంతులను చేస్తారు. ఇలా ఆత్మశక్తిని పొందినవారే దేవుని సంకల్పాన్ని తెలుసుకోగలుగుతారు, దైవసంకల్పాన్ని నెరవేర్చగలుగుతారు. ఇదే యేసు ప్రభువుకూ యూదమత నాయకులకు మధ్యగల ప్రధాన వ్యత్యాసం.

పవిత్రాత్మ పూరితులైన వారికి ధర్మచట్టాలు సులభమైన "కాడి" వంటివని ప్రభువే చెప్పారు. కనుకనే ఆత్మ శక్తిని పొందినవారికి దేవుని ఆజ్ఞలను పాటించడం నల్లేరు మీద బండినడకలా ఉంటుంది.

**రెండవది:** యూద మతాధికారులు బహిరంగ స్థలాలలో గౌరవ మర్యాదల కోసం వెంపర్లాడడాన్ని యేసుప్రభువు ఖండించారు. ఎందుకంటే ఇలా బిరుదనామాల కోసం ఆతురపడటం, దేవుని ఆజ్ఞలను తాము తూచా తప్పక పాటిస్తున్నట్లు ఆర్భాటంగా చాటి చెప్పుకోవటం ఇవన్నీ అహంభావానికీ, స్వీయశీల ప్రదర్శలకు నిదర్శనాలవుతాయి, దేవునికి ఏవగింపు కలిగించే దుర్గుణాలవుతాయి. కనుకనే ప్రభువు వారిని దుయ్యబట్ట వలసివచ్చింది.

**మూడవది:** యేసుప్రభువు తన శిష్యులను ఎప్పుడూ వినయశీలురైన జ్ఞానార్థులుగా ఉండుమని కోరుతూ వచ్చారు, బోధకుడైన తన నుంచి ప్రవర్తనా నియమాలను సద్ధర్మాలను నేర్చుకోమ్మన్నారు. ఆవిధంగా తండ్రి దేవునికి తగిన సంతానంగా జీవించుమని ఆదేశించారు.

**ముగింపు:**

నిజమైన శిష్యుడు తన గురువుగారి అడుగుజాడల్లో నడుస్తాడు, ఆయన బోధించే సత్యాలకు తానే సాక్షిగా, తానే సజీవమైన భాష్యంగా జీవిస్తాడు. ఆలాంటి ఆదర్శ జీవనమే, ఎందరికో స్ఫూర్తినిస్తుంది, మరెందరికో శిష్యులుగా మలుస్తుంది.

క్రైస్తవులమైన మన మందరమూ సాక్షాత్తూ క్రీస్తుప్రభువుకే శిష్యులం. ఆయన బోధలకు భాష్యాలుగా, ఆయన ఆదర్శాలకు నిలువుటద్దాలుగా, ఆయనకు అచ్చుమైన ప్రతిరూపాలుగా జీవించవలసిన వాళ్ళం. మరి మనం అలా జీవిస్తున్నామా? ఆత్మపరిశీలన చేసుకోమంటున్నారు ప్రభువు. మనం ఏ మేరకు నిజమైన శిష్యులుగా మారగలిగామో, ఇంకా మనలో మార్పు తెచ్చుకోవలసిన ఆలోచనలు అలవాట్లు ఏమున్నాయో గుర్తించి, ఈరోజునుంచే వాటిని మార్చుకొమ్మని ప్రభువు కోరుతున్నారు.

# సామాన్య 32 వ ఆదివారం
# 12-11-2017

## *సొలో. జ్ఞాన 6:12-16    1తెస్స 4:13-17   మత్తయి 25:1-13*

దైవార్చన సంవత్సరం ముగియవస్తోన్న ఈ దశలో శ్రీసభ మనకు యేసుప్రభు రెండవరాక గురించి గుర్తుచేస్తోంది. ప్రభు రాకకు మనం ఏమేరకు సిద్ధంగా ఉన్నామో ఆత్మపరిశీలనం చేసుకొమ్మంటుంది. అలా లోకాంత్యగడియకోసం, ప్రభు రెండవ రాకకోసం మనల్ని మనం సిద్ధం చేసుకోవడానికి అత్యుత్తమ మార్గం ఒకటుంది. అదేమిటంటే పవిత్రాత్మ ప్రభువుతో సదా సత్సంబంధాలను, సాన్నిహిత్యాన్నీ కలిగి ఉండడం. ఇందుకు దివ్యసత్ప్రసాదం ఎంతగానో దోహదం చేస్తుంది. దివ్యసత్ప్రసాదం ద్వారా మనం పవిత్రాత్మ పూరితులమై పవిత్ర జీవనం గడుపుతూ రెండవరాక సందర్భంలో పరమ పావనుడైన ప్రభువును ముఖాముఖి దర్శించే యోగ్యతను పొందగలుగుతాం, ఆయనతో ఐక్యం చెందగలుగుతాం.

**మొదటిపఠనం: సొలో.జ్ఞాన 6:12-16**

బైబిలులోని జ్ఞానగ్రంథాన్ని ఇస్రాయేలీ రాజు సొలోమోను రాశాడని చెబుతారు. ఎందుకంటే ఏ వరం కావాలో కోరుకొమ్మని దేవుడు అడిగినపుడు సిరిసంపదలకు బదులు జ్ఞానవరాన్ని కోరుకున్న విజ్ఞుడతడు. అయితే ఆనంతరకాలంలో సొలోమోనురాజు జ్ఞానవరాన్ని వీడి, లౌకిక వ్యామోహాలకు దాసుడై అన్ని విధాలుగా భ్రష్టుడు కావడం వలన ఈ గ్రంథాన్ని అతడు రచించే అవకాశమే లేదని బైబులు పండితులు నిర్ధారించారు.

ఆధునిక అధ్యయనాల ప్రకారం ఈ జ్ఞానగ్రంథాన్ని ఈజిప్టులో నివశించే యూదుడొకరు రచించి ఉండవచ్చునని వెల్లడవుతోంది. బహునిష్ఠాగరిష్ఠుడు, భక్తిపరుడైన ఈ యూదుడు అనన్య సామాన్యమైన దేవుని జ్ఞానాన్ని గురించి నిరంతరమూ ధ్యానిస్తూ చేసిన సుదీర్ఘ రచన ఇది. తనతోటి యూదులు గ్రీకు తత్వశాస్త్రాన్నీ, గ్రీకుల జ్ఞాన సాహిత్యాన్నీ అధ్యయనం చేస్తూ జ్ఞానోదయాన్ని పొందే ప్రయత్నం చేస్తూంటే, ఈ రచయిత జ్ఞానార్జనకు గాను సాక్షాత్తూ యావే దేవుణ్ణే ఆశ్రయించాడు. యావే దేవునిపట్ల భక్తివిశ్వాసాలను పెంపొందించడం, దేవుని దివ్యజ్ఞానంపట్ల తోటి ఇస్రాయేలీయులకు నమ్మకాన్ని కలిగించడం ఈ గ్రంథ ప్రధానోద్దేశ్యం. దేవుడు తమతో చేసుకున్న ఒడంబడికకు కట్టుబడి దైవవిధేయ జీవనం గడపడం ద్వారానే తమకు దివ్యజ్ఞానం సిద్ధిస్తుందని ఈ గ్రంథం ఉద్బోధిస్తుంది.

ఈనాటి మొదటి పఠనంలో మనం సొలోమోను జ్ఞానగ్రంథం తొలిభాగంలోని చివరి వచనాలను చదువుతున్నాం. ఈ భాగంలో రచయిత జ్ఞానాన్ని అమరత్వానికి వాకిలిగా

పేర్కొంటున్నాడు. అంతేకాదు జ్ఞానం "తన్ను వెదకువారికి", తన కోసం వేచియుండువారికి సులభంగా లభిస్తుందని ఉద్ఘాటిస్తున్నాడు.

గ్రీకు దేశీయుల ప్రమాణాల ప్రకారం జ్ఞానం వ్యక్తిగత కృషి ఫలితంగాను, హేతుబద్ధమైన సశాస్త్రీయమైన తర్కం ద్వారానూ లభిస్తుంది. దైవజ్ఞానం మాత్రం దైవప్రజలకొక వరంలా లభిస్తుంది. అవును. ఇంతకు ముందు చెప్పుకున్నట్టు "తన్ను అభిలషించు వారికది వెంటనే సాక్షాత్కరిస్తుంది"

ఈనాటి మొదటి పఠనం, సువార్తా పఠపంలో చదువుతోన్న "పదిమంది కన్యలు" ఉపమానం రెండూ ఒకే సందేశాన్ని అందజేస్తున్నాయి. మెలకువగా ఉండి "జ్ఞానం" కొరకు ఎదురుచూచేవారి నిరీక్షణ తప్పక ఫలిస్తుంది, సత్ఫలితాన్ని అందజేస్తుంది.

**రెండవపఠనం: 1తెస్స 4:13-17**

తొలినాటి క్రైస్తవ సంఘాలవారు యేసుప్రభు రెండవరాక అతిత్వరలో సంభవిస్తుందని నమ్మేవారు. ముఖ్యంగా తెస్సలోనికా క్రైస్తవులు మోక్షారోహణుడైన క్రీస్తుప్రభువు అతిత్వరలో మరల రాబోతున్నారని గాఢంగా విశ్వసించేవారు. జ్ఞానస్నానం ద్వారా ఇప్పటికే క్రీస్తు మహిమలో పాలుపంచుకుంటున్న తాము అతి త్వరలో రాబోతున్న ప్రభువును కళ్ళారా దర్శించి ఆయన మహిమా ప్రాభావాలలో భాగస్వాములు కాగలమని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

అయితే ఇక్కడే వారినొక చిత్రమైన సందేహం పీడించసాగింది. అదేమిటంటే జీవించి ఉన్న తామెలాగూ ప్రభువు మహిమలో భాగస్థులుకాగలుగుతారు; కానీ అప్పటిలోగా మరణించిన తమవారి మాటేమిటి? ప్రభువు మహిమలో వారికి భాగం ఉండదా? మరణం వారిని భాగ్యవిహీనులను చేస్తుందా? ఈలాంటి సంశయాలన్నింటినీ పౌలు తన లేఖ ద్వారా నివృత్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. "క్రీస్తు నందలి విశ్వాసముతో మరణించినవారు ముందుగానే పునరుత్థానమును పొందుతారు" అని స్పష్టం చేస్తున్నాడు.

క్రీస్తు ప్రభువును నిండు మనస్సుతో విశ్వసించి పుణ్యజీవనం గడిపి మరణించినవారు, అంతిమ తీర్పు నాడు ప్రభువు విధించే శిక్షనుంచి తప్పించుకోగలుగుతారు. "నిత్యజీవాన్ని" పొందగలుగుతారు; ఎందుకంటే మరణానికి ముందే వారు "అమరత్వానికి వాకిలి" వంటి 'ఒదేవుని దివ్యజ్ఞానాన్ని" పొంది ఉంటారు; గనుక మరణించిన ప్రభు విశ్వాసులు ముందుగానే పునర్జీవం పొందుతారని చెబుతున్నాడు పౌలు.

అలాగే లోకాంత్యం నాడు జరుగబోయే దేవుని సాక్షాత్కార మహద్ఘటనను సూచించడానికి పౌలు ఇక్కడ ప్రళయకాలపు సాంకేతిక పదాలను ఉపయోగిస్తున్నాడు. "ఆజ్ఞావరము", "దేవదూత పిలుపు", "బాకాధ్వని", "మేఘములు" మొదలైనవన్నీ దైవసాక్షాత్కార సమయంలో విధిగా సంభవించే సహజ పరిణామాలు. ప్రళయకాల సాహిత్యంలో ఈ తరహా ప్రతీకలు ఎక్కువగా కనిపిస్తాయి.

## సువార్త పఠనం: మత్తయి 25:1-13

యేసుప్రభువు "అంత్యదినాల" గురించి చేసిన ప్రబోధాలన్నీ మత్తయి సువార్తలో మనకు ఒకేచోట కనిపిస్తాయి. ఈ ప్రబోధాలలో ఒకటి "పదిమంది కన్యలు" ఉపమానం. తన సిలువ మరణానికి కొన్ని వారాల ముందు ఈ ఉపమానం చెప్పినప్పటికీ, అప్పటికే తాను మహిమాన్వితుడై మరల రానున్నట్లు యేసుప్రభువుకు స్పష్టంగా తెలుసు.

అయితే ఈ ఉపమానాన్ని గ్రంథస్తం చేసేనాటికి, యేసుప్రభువు మరల రావడానికి మరికొంత సమయం పడుతుందని సువార్తాకారుడు మత్తయికి తెలుసు; అదే సమయంలో ప్రభు "రెండవరాక"పై తన క్రైస్తవ సంఘంలో ఉన్న విశ్వాసులకు ఎన్ని ఆశలున్నాయో, వారు ఎంతగా ఈ పుణ్యగడియకోసం ఎదురుచూస్తున్నారో కూడా మత్తయి గ్రహించాడు. కనుకనే "యేసుప్రభువు మరల రాబోతున్నా"రన్న సత్యాన్ని రూఢి పరుస్తూనే, ఆయన వచ్చేవరకు విశ్వాసులు యథార్థమైన ప్రభుశిష్యులుగా ఆదర్శ క్రైస్తవ జీవనం గడుపతూ ఉండాలనీ, "ఆ దినమును, ఆ గడియను ఎరుగరు" గనుక అనుదినము అనుక్షణము మెలకువగా ఉండాలని మత్తయి ఈ ఉపమానం ద్వారా విశ్వాసులకు బోధించదలచుకున్నాడు.

ఈ ఉపమానం అంతరార్థాన్ని గ్రహించాలంటే ముందుగా "రాతిపునాది ఇసుక పునాది" ఉపమాన భావాన్ని తెలుసుకొని ఉండాలి; అలాగే, ఈ దిగువ ఇచ్చిన విశేషాలను దృష్టిలో ఉంచుకోవాలి.

**మొదటిది:** "అవివేకవతులు" అనే మాటకు గ్రీకుమూలం "మొరాయి", ఈ గ్రీకు పదానికి "అవివేకులు" అన్నది ఒక అర్థమైతే, "అవిశ్వాసులు" అని మరో అర్థం కూడా ఉంది. అవిశ్వాసులు అంటే ఇక్కడ దేవుని దివ్యజ్ఞానం లేనివారన్నది తాత్పర్యం.

**రెండవది:** యూదమత సంప్రదాయం ప్రకారం "నూనె" పవిత్రాత్మకు సంకేతం, "కాగడా" నీతికార్యాలకు ప్రతీక ఇక్కడ నీతికార్యాలు అంటే మనకు పవిత్రాత్మ ప్రభువు ప్రసాదించే శక్తితో, పవిత్రాత్మ ఎరుకపరచే తండ్రి దేవుని సంకల్పాన్ని గ్రహించి, ఈ ప్రకారం చేసే మంచి పనులని అర్థం,

**మూడవది**: ఈ ఉపమానంలోని "వివేకవతులైన కన్యలు" మొక్కవోని భక్తివిశ్వాసాలతో పవిత్ర జీనం గడుపుతూ నీతిమంతమైన పనులు చేస్తూ ఉండే క్రైస్తవ విశ్వాసులకు ప్రతినిధులు.

**నాల్గవది:** అలాగే భక్తి విశ్వాసాలు లేని క్రైస్తవులను, పవిత్రజీవనం గడపని క్రైస్తవులను, నీతికార్యాలు చేయని క్రైస్తవులను ఈ ఉపమానంలోని "అవివేకవతులైన కన్య" లతో సరిపోల్చుతున్నారు.

ఇక్కడ "వివేకవతులైన" కన్యలకు, "అవివేకులైన" కన్యలకు మధ్యగల వ్యత్యాసం ప్రాథమికంగా ఆధ్యాత్మికమైనది. ఆధ్యాత్మిక వ్యక్తిత్వం గలవారు తమ జీవితాలను "విశ్వాస" మనే పునాదిపై నిర్మించుకుంటారు; ఆధ్యాత్మిక వ్యక్తిత్వం లేనివారు "అహం" పునాదిపై

తమ జీవితాలను నిర్మించుకొని అవివేకులుగా బతుకులు వెళ్ళదీస్తుంటారు.

**అయిదవది:** "నేను మిమ్ము ఎరుగను" అంటూ పెండ్లికుమారుడు అవివేకవతులతో పలికిన మాటలు పరోక్షంగా అప్పటికే "వివేకవతు"లతో ఆయనకు ఏర్పడిన గాఢానుబంధాన్ని సూచిస్తున్నాయి. పెండ్లికుమారుడు వారిని ఎరుగుదురు అలాగే వివేకవతులైన కన్యలు సదా ప్రభువును సేవిస్తూ ఆయనకు విశ్వాస పాత్రులైన శిష్యులుగా జీవిస్తూ ఉంటారు కనుక "పెండ్లికుమా"రుని గురించి వారు ఎరుగనిది ఏదీ ఉండదు.

ఇలా ప్రభువుకూ ప్రభుజనులకూ మధ్యగల అనుబంధం ఆధారంగానే శ్రీసభలోని తపోజీవన సంప్రదాయంలో ఒక నానుడి ప్రచారంలోకి వచ్చింది. అదేమిటంటే

**"ఆయన ఎక్కడికి వేంచేస్తారో**
**అక్కడే ఆయన కొలువుదీరి ఉంటారు;**
**ఆయన ఎక్కడ కొలువుదీరి ఉంటారో**
**అక్కడికే ఆయన వేంచేస్తారు! అలాగే**
**ఆయన ఎక్కడ ఎప్పుడూ కొలువుదీరి ఉండరో**
**అక్కడికి ఆయన ఎప్పుడూ వేంచేయరు!"**

ఒక్క మాటలో చెప్పాలంటే ఈనాటి సువార్త పఠనం ప్రభు శిష్యులైన క్రైస్తవులు నిద్రలో జోగుతూ బతకరాదని హెచ్చరిస్తోంది. నిత్య చైతన్యంతో క్రియాశీలకమైన ఆధ్యాత్మిక వ్యక్తిత్వంతో జీవించాలనీ ప్రభువు మరల వచ్చువరకు ఆశాభావంతో నిరీక్షిస్తూ ఉండాలనీ హితవు చెబుతోంది.

**ముగింపు:**

ఏదైనా పని చేసేటపుడు పదిసార్లు ఆలోచించుమని చెప్తారు పెద్దలు. మనం చేసే పనులే చివరికి మన జీవితానికి నిర్వచనాలవుతాయి. మనం చేసేవి మంచి పనులైతే మన జీవితాలు అందరి మన్ననలు పొందుతాయి. మనం చేసేవి మంచి పనులు కాకపోతే మన జీవితాలు మసగబారిపోతాయి, వృధా అవుతాయి. కనుక మంచి పనులు చేసే అవకాశాలు మనకు లభించినపుడు వాటిని వదులుకోకూడదు, సద్వినియోగం చేసుకోవాలి. మంచికోసం ఎంతటి కష్టాన్నయినా ఇష్టంగా భరించగలగాలి. అప్పుడే మన జీవితం సంపన్నమవుతుంది, సత్ఫలితాలను పొందుతుంది. అందుకే పెద్దలు చెప్పినట్టు మనం పదిసార్లు ఆలోచించినా చివరికి మంచి పనులే చేయాలి, మంచి చేసే అవకాశాలకోసం ఎదురుచూస్తూ ఉండాలి. అప్పుడే "వివేకవంతులైన కన్యల" మాదిరి మనమూ "దివ్యపరుని" దీవెనలు పొందగలుగుతాం, మోక్ష బహుమానాన్ని పొందగలుగుతాం!

# సామాన్య 33వ ఆదివారం
# 19-11-2017

***సామెతలు 31:10-13 1తెస్స 5:1-6 మత్తయి 25:14-30***

మనం దైవరాజ్యంలో ప్రవేశించి, దైవరాజ్య పౌరులుగా మన బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చాలి అంటే ముందుగా మనకు దేవుడి పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలి. యథార్థమైన దేవుని స్వరూప స్వభావాలను స్పష్టంగా అర్థం చేసుకోగలగాలి. దేవుడిపట్ల మనకున్న అవగాహన అపసవ్యంగా ఉంటే మనం స్పందించే తీరు, ప్రవర్తించే విధానం కూడా లోపభూయిష్టమై ఉంటాయి; మనం ఇతరుల తప్పొప్పులను ఎన్నడం, వారికి తీర్పు చెప్పడం, ఖండించడం, శిక్షించడం ఇవన్నీ దేవుడిపట్ల మనకుగల అపసవ్యమైన అవగాహన వల్లనే జరుగుతూ ఉంటాయి.

నిజానికి యేసుక్రీస్తు అవతరణం, మరణ పునరుత్థానాల ద్వారానే మానవులు యదార్థమైన దేవుణ్ణి తెలుసుకోగలిగారు. ఆయన స్వరూప స్వభావాలను ఆకళింపు జేసుకోగలిగారు.

దేవుడు ఒక తండ్రి. ఆయనకు గల ప్రేమ కారుణ్యాలు అపారమైనవి, అనంతమైనవి. దివ్యసత్ప్రసాదం ద్వారా యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యులకు తండ్రి దేవుని దివ్యజ్ఞానాన్ని ప్రసాదిస్తూ ఉంటారు; తండ్రి దేవుని పట్ల వారికి పరిపూర్ణమైన అవగాహన కలిగిస్తారు, వారికి దేవుడు నిర్దేశించిన జీవన మార్గమేమిటో ఆయన సంకల్పమేమిటో తెలియజేస్తూంటారు.

**మొదటిపఠనం: సామెతలు 31:10-13**

సామెతల గ్రంథం దేవుడితో చేసుకున్న ఒడంబడిక ప్రకారం జీవించే క్రమంలో ఇస్రాయేలీయులు తెలుసుకున్న జీవిత సత్యాల సంకలనం. వీటిలో కొన్ని ఇస్రాయేలీ మునులు చెప్పిన సూక్తులున్నాయి, వారి ధార్మిక ప్రబోధాలున్నాయి, వారు సముపార్జించిన దివ్యజ్ఞాన ప్రవచనాలున్నాయి, ధర్మచట్టం పట్లగల నిబద్ధతతో వారు పలికిన హిత వచనాలున్నాయి.

ఈ సామెతల్లో కొన్ని పూర్తిగా మతపరమైనవిగా కనిపిస్తాయి, మరికొన్ని పూర్తిగా సామాజిక జీవనానికి సంబంధించిన సూక్తులుగా కనిపిస్తాయి. మతపరమైనవిగా కనిపించే

సామెతలు ఇస్రాయేలీయులు దేవుడితో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి జీవించడమెలాగో బోధిస్తూ ఉంటాయి సామాజిక సామెతలు దేవుడితో నిమిత్తం లేకుండా, కేవలం ప్రాపంచిక జీవన నియమాలనే ఉటంకిస్తూ ఉంటాయి.

అయితే దేవుడికీ ఇస్రాయేలీయులకు మధ్య జరిగిన ఒడంబడిక ఇస్రాయేలీ ప్రజా జీవితంలోని అన్ని రంగాలను ప్రభావితం చేస్తుంది కనుక, కేవలం సామాజిక సూక్తులుగా కనిపించే సామెతల్లో కూడా ఆధ్యాత్మిక విలువలు అంతర్లీనంగా ఉంటాయి. కనుక ఈ గ్రంథంలోని సామెతలన్నీ స్థూలంగా ఆధ్యాత్మిక ఉపదేశాలేనని, ఇస్రాయేలీయుల దైవ విధేయ జీవన ప్రస్థానంలో ప్రాదుర్భవించిన అనుభవ జ్ఞాన శకలాలేననీ, ఇవన్నీ భక్తి జీవన వికాసానికి దోహదం చేసే సత్యోపదేశాలేననీ గ్రహించగలుగుతాం.

ఈనాటి మొదటి పఠనంలో మనం చదువుతోన్న సామెతలు "ఆదర్శ గృహిణి" గుణగణాలకు సంబంధించినవి. ఆదర్శ గృహిణి దేవునిపట్ల భయభక్తులు కలిగి ఉంటుంది. దేవుని త్రికరణశుద్ధిగా ఆలోచనలతో శుద్ధిగల మాటలతో విశుద్ధమైన చేతలతో ప్రేమిస్తుంది. ఆమె తన భక్తి జీవనం ద్వారా కుటుంబంలో ఉన్న వారందరికీ దైవాశీస్సుల నార్జించి పెడుతుంది. ఉత్తమ ఇల్లాలు అందరినీ ప్రేమతో ఆదరిస్తుంది. ముఖ్యంగా పేదసాదలను అవసరాలలో ఉన్నవారిని ఆదుకొంటుంది. సంఘంలోని పెద్దలు ఆమె పరిణత జ్ఞానాన్నీ, భక్తితత్పరతను గుర్తించి గౌరవిస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే దేవునిపట్ల భయభక్తులు కలిగిన ఆదర్శ గృహిణి దేవుడు తనకు నిర్దేశించిన జీవన మార్గాన్ని గుర్తించి, బాధ్యతతో తన బ్రతుకును, తన కుటుంబాన్నీ దిద్దుకోగలుగుతుంది, ఫలితంగా అందరి ప్రశంసలు పొందగలుగుతుంది.

**రెండవ పఠనం: 1తెస్స 5:1-6**

ఈ పఠనంలో పునీత పౌలు "రాత్రివేళ వచ్చు దొంగవారి" ఉపమానాన్ని ప్రస్తావిస్తున్నాడు. అంటే "ప్రభువు రాబోవు దినము" గురించి యేసు చేసిన ప్రబోధాలు ఆధారంగానే పౌలు ఈ విషయాన్ని వివరిస్తున్నారని తెలుసుకోవాలి. "దొంగవాని ఉపమా"నాన్ని ప్రస్తావించడం ద్వారా పౌలు స్పష్టం చేయదలచుకున్న విషయమేమిటంటే ప్రభువు ఎప్పుడు ఏ గడియలో రాబోతున్నారో తెలుసుకోవడం ప్రధానం కాదు; ప్రభువు ఏ గడియలో ఎప్పుడు వచ్చినా మనం మెలకువగా ఉండడం, సర్వదా సంసిద్ధులమై ఉండడం, ప్రభువును సాదరంగా ఆహ్వానించడానికి యోగ్యులమై ఉండటం ప్రధానం. నిజానికి క్రైస్తవులందరికీ ఇదొక పెనుసవాలు.

మరోమాటలో చెప్పాలంటే పౌలు ప్రభువురాక కోసం ఎదురుచూస్తూ ఊహల్లో బతకమని బోధించడం లేదు; దానికి బదులు వాస్తవిక దృక్పథాన్ని పెంపొందించుకొమ్మని ఉపదేశిస్తున్నాడు. పవిత్రాత్మ ప్రబావంతో ప్రతినిత్యము తన క్రైస్తవ జీవనాన్ని నూత్నీకరించుకుంటూ, సరిదిద్దుకుంటూ "ప్రభువు మరల వచ్చువరకు" ఆశాభావంతో నిరీక్షిస్తూ ఉండాలని స్పష్టం చేస్తున్నాడు.

ఇక్కడ ప్రభువు రాకకోసం అనునిత్యమూ అనుక్షణము తమను సిద్ధపరచుకొనె వారిని గురించి ప్రస్తావిస్తూ పౌలు "ప్రకాశము", "పగలు", "మెలకువ", "అప్రమత్తత" వంటి ప్రతీకాత్మక పదాలను ఉపయోగించాడు. అలాగే ప్రభువు రాకకోసం సిద్ధపడని వారిని గురించి చెబుతూ "రాత్రి", "చీకటి", "సత్యదూరమైన శాంతి, భద్రత" మొదలైన పదజాలాన్ని ప్రయోగించాడు.

ఇలా పౌలు యేసు రెండవ రాక గురించి ఊహలల్లుకుంటూ కాలక్షేపం చేసే విశ్వాసులను మందలిస్తూ అనునిత్యం, అనుక్షణం తమను తాము సిద్ధపరచుకోవడంలో నిమగ్నులై ఉండుమని పిలుపునిస్తున్నాడు; ఇందుకు కారణమేమిటంటే "ప్రభు సన్నిధానం" ఇప్పటికే మన మధ్య నెలకొని ఉంది, "అంత్యదినం" కోసం క్రైస్తవులను సిద్ధపరుస్తూనే ఉంది. తీర్చిదిద్దుతోంది. కనుక కల్లలాడుతూ పరస్పర వంచనకు పాల్పడకుండా, ఆత్మప్రేరణతో ఆత్మశుద్ధితో పవిత్రజీవనం గడుపుతూ ప్రభువు మహిమాన్వితుడై వేంచేయు గడియ వరకు వేచి ఉండుమని హితవు చెబుతున్నాడు పౌలు.

**సువార్త పఠనం: మత్తయి 25:14-30**

ఈనాటి సువార్త పఠనంలో మనం "సేవకుని కర్తవ్యం – నిర్వహణ విధానం" ఉపమానాన్ని చదువుతున్నాం. ప్రభువు "రెండవరాక" లో జాప్యం జరుగుతుందని సూచించే మూడు ఉపమానాలలో ఇది మూడవది. మిగతా రెండు: "నమ్మినబంటు – నమ్మని బంటు", "పదిమంది కన్యలు". ముఖ్యంగా "నమ్మిన బంటు – నమ్మని బంటు" ఉపమానానికి ఇప్పుడు మనం చదువుతోన్న తాలెంతుల ఉపమానానికీ, కథాపరమైన నేపథ్యం ఒక్కటిగానే కనిపిస్తుంది. ఈ రెండు ఉపమానాలలోను యజమానుడు ఇంటికి తిరిగి రావడంలో జాప్యం జరుగుతుంది.

ప్రస్తుతం ఉపమానాన్ని చెప్పడంలో యేసుప్రభు కథా కథన నైపుణ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఐదు లక్షల వరహాలు, రెండు లక్షల వరహాలు పొందిన సేవకులు వాటితో

వ్యాపారం చేసి రెట్టింపు సొమ్మును సంపాదించి యజమానుడి మెప్పును పొందుతారు. అయితే యజమానుడిచ్చిన లక్ష వరహాలను పదిలంగా పట్టుకొచ్చి ఇచ్చిన మూడవ సేవకుడు యజమానుడి ఆగ్రహానికి గురవుతాడు. ఇక్కడి నుంచి కథ మొత్తం మూడవ సేవకుడి వైపు మళ్ళుతుంది.

మూలభాష ప్రకారం యజమానుడు ఈ మూడవ సేవకుడికి ఇచ్చింది ఒక్క తాలెంతు మాత్రమే. అయినా అది తక్కువ సొమ్మేమీ కాదు! అది 600 పనిదినాల వేతనంతో సమానం; సుమారు లక్ష వరహాలు. ఇచ్చిన సొమ్మును ఇచ్చినట్లు తెచ్చి యజమానుడికి అప్పగించాడు మూడవ సేవకుడు. నిజానికి ఇతడు చేసిన పనిలో తప్పు పట్టడానికి కారణమేమీ కనిపించదు. ఇచ్చిన సొమ్మును పోగొట్టకుండ పదిలంగా పట్టుకొచ్చి ఇచ్చాడు. అలాగే ఈ సొమ్మును వడ్డీకి ఇవ్వకపోవడం కూడా తప్పుకాదు. ఎందుకంటే వడ్డీకి డబ్బులివ్వడం ధర్మశాస్త్రానికి విరుద్ధం కనుక ఈ ఉపమానాన్ని విన్న ప్రజలు కూడా యజమానుడు మాత్రం తాను ఇచ్చిన ధనాన్ని వడ్డీకీయనందుకు ఆగ్రహించాడు, అతణ్ణి కఠినంగా శిక్షించాడు కూడా!

ఈ ఉపమానంలో మనం గమనించవలసిన విశేషాలు, నేర్చుకోవలసిన పాఠాలు కొన్ని ఉన్నాయి.

**మొదటిది:** ఉపమానంలోని మొదటి ఇద్దరు సేవకులు ప్రదర్శించిన తెగింపు వల్లనే వారు మొత్తం ధనాన్ని వ్యాపారంలో పెట్టుబడి పెట్టి రెట్టింపు లాభాల నార్జించి యజమానుడి మెప్పు పొందగలిగారు. ఒకవేళ వ్యాపారంలో నష్టమొచ్చినా భరించడానికి సిద్ధపడి వారి తెగువనే యజమానుడు మెచ్చుకున్నాడు, వారిని సత్కరించాడు.

ప్రభుశిష్యుల ప్రధాన లక్షణాలలో ఈ “తెగువ” కూడా ఒకటని మనకీ ఉపమానం బోధిస్తుంది. ప్రభు ఆజ్ఞల ప్రకారం ఎన్ని కష్టనష్టాలనైనా భరించడానికి “తెగువ” చూపగలిగిన వాళ్ళే ప్రభువుకు విశ్వాస పాత్రులైన శిష్యులు కాగలుగుతారు. ముఖ్యంగా లౌకిక ధోరణులు, లోతు తక్కువ నైతిక విలువలు, ఇంటా బయటా రాజ్యమేలే స్వార్థప్రయోజనాలు అడుగడుగునా క్రైస్తవుల కాళ్ళకు బంధాలు వేస్తోన్న ఈ రోజుల్లో దేవుడికోసం దైవరాజ్య విలువల స్థాపనకోసం “తెగువ” చూపగల శిష్యులు కావాలి.

**రెండవది:** భయం ఒక పాపం. మూడవ సేవకుడు అర్థం లేని భయం వలన, పిరికితనం వల్లనే యజమానుణ్ణి అపార్థం చేసుకొని ఆయన తనను శిక్షిస్తాడని అతడు తన

యజమానుణ్ణి చూచి భయపడనవసరం లేదు, అనుమానించవలసిన అగత్యమూ లేదు. ఎందుకంటే యజమానుడు తన సేవకులను పూర్తిగా నమ్మాడు కనుకనే విలువైన తన ఆస్తిని వాళ్ళ చేతుల్లో పెట్టి వెళ్ళాడు. నమ్మకంతోనే వాళ్ళతో ఒక ఒప్పందం కుదుర్చుకుని మరీ వెళ్ళాడు.

అయితే యజమానుడి మంచితనాన్ని గ్రహించిన మూడవ సేవకుడు, అకారణమైన భయాలను భ్రమలను పెంచుకొని యజమానుడు ఆశించిన పనిని చేయలేకపోయాడు. మిగతా ఇద్దరు సేవకుల మాదిరి మంచి ఫలితాలను సాధించలేకపోయాడు.

ఇలాంటి పొరపాట్లను తన శిష్యులు చేయరాదని ప్రభువు కోరుతున్నారు. దేవుడు కఠినాత్ముడు కాదని, ఆయన ప్రేమగల తండ్రి అని గుర్తించాలి, ఆయనను విశ్వసించాలి, ఆయన ఆదేశాలను తూచా తప్పక పాటించాలి. క్రైస్తవులకు ఉండవలసినది వినయంతో కూడిన "దైవభయమే" గానీ పిరికితనం కాదు. దైవభయం, చిత్తస్థైర్యం క్రైస్తవులకు సాక్షాత్తూ పవిత్రాత్మ ప్రభువు ప్రసాదించే అపురూపమైన వరాలు. దైవసంకల్పాన్ని నెరవేర్చడానికి ఈ వరాలు దోహదం చేస్తాయి; అర్థం లేని భయాలు క్రైస్తవుల్ని నిర్వీర్యుల్ని చేస్తాయి, దైవ సంకల్పాన్ని నెరవేర్చడానికి అవరోధాలవుతాయి.

**మూడవది:** ఉపమానంలోని మూడవ సేవకుడికి దేవుడంటే విపరీతమైన భయముంది. నిజానికి ఇంత భయమున్న వాళ్ళు చెప్పిన పనిని మరింత శ్రద్ధగా పూర్తి చేయడానికి పనిచేస్తారు; కానీ చిత్రమేమిటంటే అంత భయం ఉండికూడా ఈ సేవకుడు తను చేయవలసిన పనిని సక్రమంగా పూర్తిచేయలేకపోయాడు.

అసలు విషయమేమిటంటే ఇలా దేవుడు కఠినాత్ముడని, కఠోరమైన శిక్షలు విధిస్తాడని బెంబేలు పడేవారు సాధారణంగా దేవుడి సంకల్పాన్ని నెరవేర్చరు. దేవుడు పాటించుమని చెప్పిన అసలైన ఆజ్ఞలను పట్టించుకోవడమే మర్చిపోతారు. ఈ ఉపమానంలోని మూడో సేవకుడి విషయంలో అదే జరిగింది. న్యాయపాలన విషయంలో దేవుడు కఠినంగా వ్యవహరిస్తారని తెలిసి కూడా దేవుని ఆదేశాలను పాటించడంలో విఫలుడయ్యాడు.

నిజానికి దేవుడు కఠినాత్ముడు కాదని, ఆయన సర్వోత్తమ సత్యవంతుడని

ప్రేమమయుడని "క్రీస్తు మరణ పునరుత్థానాలు" లోకానికి వెల్లడిస్తున్నాయి. అవును. దేవుని పలుకులు సత్యోపదేశాలు, దేవుని చేతలన్నీ ప్రేమ పూరితాలు.

**నాల్గవది:** మన జీవితమే దేవుడు మనకిచ్చిన లక్ష వరహాల వరమనుకోవాలి. ఈ జీవితంలో మనం ఏం చేయాలని, ఏం సాధించాలని దేవుడు కోరుతున్నారో "సదసదాత్మవిచారణ" ద్వారా తెలుసుకోవాలి, దేవుడు కోరినవన్నీ సాధించి వాటిని తిరిగి దేవునికి సమర్పించాలి. ఇలా దేవునికి సమర్పించగల అమూల్యమైన కానుక "మన ఆత్మ" అవును. "దైవరాజ్యంలో ప్రవేశార్హత సాధించిన ఆత్మ" ను మించిన అపురూపమైన కానుక మరొకటి ఉండదు. కనుక దేవుడనుగ్రహించిన జీవితాన్ని ఫలప్రదంగా జీవిస్తూ, జీవన ఫలాలను దేవునికి అర్పణ చేద్దాం, "పరలోక యజమానుడి" మన్ననలు పొందుదాం!

## ముగింపు:

దేవుడు మనలోని ప్రతి ఒక్కరికి కొన్ని ప్రత్యేకమైన నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలు ఇస్తారు. వాటిని మనం సమాజ శ్రేయస్సుకోసం, లోక కల్యాణంకోసం వినియోగించాలని కోరుతూంటారు. నిజానికి దేవుడు మనకు ప్రసాదించే వరాలన్నీ ఆయనలో ఉన్న దివ్యగుణాలే, మంచి లక్షణాలే! వాటిని మనం సద్వినియోగం చేసుకోవాలి. మనం మన ఆలోచనలద్వారా మన మాటల ద్వారా మన చేతలద్వారా దేవుని మంచితనాన్ని సాటి మానవులతో పంచుకోగలిగితే, లోకమంతా దేవుని దివ్యగుణాల సుమవనంలా వర్ధిల్లుతుంది, శాంతీ సౌఖ్యాలతో విరాజిల్లుతుంది.

మరి మన జీవితంలో దేవుని మంచితనం ఏ మేరకు పుష్పిస్తుంది. ఏ మేరకు ఫలిస్తుంది, మన చుట్టూ ఉన్న మనుషులను, సమాజాన్నీ, ప్రపంచాన్నీ ఏ మేరకు ప్రభావితం చేయగలుగుతుంది? ఆత్మపరిశీలన చేసుకుందాం!

# క్రీస్తురాజు మహోత్సవం
# 26-11-2017

**యెహె 34:11-12, 15-171   కొరి 15:20, 26-28   మత్త 25:31-46**

క్రైస్తవులు నిరంతరమూ క్రీస్తురాజు నాయకత్వంలోనే నడవాలి; సదా క్రీస్తు రాజు అధికారానికి విధేయులై జీవించాలి. అప్పుడే వారు లోకాన్ని జయించగలుగుతారు, లోకాంత్యాన పునరుత్థానమైన దివ్య దేహాలతో నిత్య జీవావరణంలో ప్రవేశించగలుగుతారు.

నేడు దివ్యసత్ప్రసాదంలో కొలువు దీరి ఉన్న క్రీస్తురాజు నిర్విఘ్నంగా తన పరిపాలన కొనసాగిస్తున్నారు; వారు ప్రేమమూర్తులై పరస్పరం సేవా సహకారాలనందజేసుకుంటూ ఆదర్శజీవనం గడపడానికి దోహదం చేస్తున్నారు. ముఖ్యంగా తన రాజ్యపాలనా పరిధిలోనికి రావలసిన పేదలను, బడుగు వర్గాల ప్రజలందరినీ ప్రేమతో ఆదరించే మంచిమనస్సులను తన శిష్యులైన క్రైస్తవులకు ప్రసాదిస్తున్నారు.

## మొదటి పఠనం: యెహెజ్కేలు 34:11-12,15-17

ఇస్రాయేలీయులు బాబిలోనియా ప్రవాసంలో ఉన్న దశలో యెహెజ్కేలు ప్రవక్త వెలుగులోనికి వచ్చాడు. దైవాదేశాలను ధిక్కరించి అపరాధాలు చేసినందుకు ఇప్పటికైనా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ దేవుని శరణు కోరుమని ప్రబోధిస్తున్నాడు. దయగల దేవుడు వారిని తప్పక మన్నిస్తారని, తిరిగి వారిని వాగ్దత్త భూమికి చేర్చుతారని ప్రవచిస్తున్నాడు.

ఈనాటి పఠనాన్ని సవ్యంగా అర్థం చేసుకోవాలంటే గతంలో జరిగిన చారిత్రక పరిణామాలను కూడా పరిగణలోనికి తీసుకోవలసి వస్తుంది. తనకు నమ్మక పాత్రులుగా మెలగవలసిన ఇస్రాయేలీ రాజులు తన మాటలను పెడచెవిన పెట్టి స్వార్థ ప్రయోజనాల కోసం అనేక అకృత్యాలకు పాల్పడినందుకుగాను దేవుడు వారిని దండించారు. ఇస్రాయేలీ ప్రజకు "కాపరుల్లా" ఉండవలసిన వారే వారి పతనానికి కారుకులై వారిని శత్రువుల చెరలో బందీలుగా, బానిసలుగా మార్చినందుకు దేవుడు ఇస్రాయేలీ పాలకులను తీవ్రంగా ఖండించారు.

అలా పాలకులను ఖండించిన దేవుడే ప్రజలను కరుణించారు. ఇస్రాయేలీ ప్రజలకు ఇకపై తాను "కాపరి" కాబోతున్నట్టు వాగ్దానం చేశారు. చెల్లా చెదురైన వారిని తిరిగి తానే చేరబిలుస్తానన్నారు, "దుర్భలు" లైన వారిని ఆదరించి అండగా ఉంటానన్నారు. "తన గొర్రె" లను ఇకపై తానే పచ్చిక మైదానాలకు కొనిపోయి మేపుకొని వస్తానన్నారు. ఒక్కమాటలో

చెప్పాలంటే తాను ఎన్నుకొన్న ప్రజలకు ఇకపై తానే "దివ్యకాపరి" నవుతానని బాస చేస్తున్నారు ప్రభువు.

ఈ నేపథ్యంలో ఈనాటి పఠనాన్ని చదివితే దేవుడు ప్రవాసంలో ఉన్న ఇస్రాయేలీయులను తిరిగి వాగ్దత్త భూమికి రప్పించబోతున్నారన్న సత్యం బోధపడుతుంది. అలాగే "మంచికాపరి" యావే దేవుడే స్వయంగా తన ప్రజల బాగోగులు చూస్తాను అని చెబుతూంటే, ఇస్రాయేలీ చరిత్రలో "మానవ పాలన" అంతమై "దేవుని పాలన" ఆరంభమవుతుందేమోనన్న అభిప్రాయం కలగడం కూడా సహజమే. కానీ అది దైవసంకల్పం కాదు. తన సేవకుడైన దావీదు వారసుణ్ణి తన ప్రజలకు "కాపరి" గా నియమించనున్నట్టు తిరిగి దేవుడే స్వయంగా ప్రకటించడం గమనార్హం

అలా యెహెజ్కేలు ప్రవక్త ద్వారా దేవుడు పలికించిన ప్రవచనం తన దివ్యకుమారుడు, దావీదు వంశీయుడైన యేసుక్రీస్తు ప్రభువు ద్వారా నెరవేరింది. ప్రభుక్రీస్తువే మనకు దేవుడొసగిన "మంచికాపరి"

చివరిగా "గొర్రెలను మేకల నుండి వేరు చేస్తూ" కాపరి తీర్చబోయే న్యాయతీర్పు లోకాంత్యంలో ప్రభువు చేసే "అంతిమతీర్పు" గురించి చదువబోతున్నాం.

**రెండవ పఠనం:** 1 కొరింతి 15:20-26,28

ఈ పఠనంలో పౌలు ముందుగా క్రీస్తుప్రభువును ఆదాముతో పోల్చి వారివురికి మధ్యగల వ్యత్యాసాలను వెల్లడిస్తున్నాడు. తొలి మానవుడైన ఆదాము ఆనాడు సృష్టింకంతటికి మకుటంలేని మహారాజులా విరాజిల్లాడు. కానీ తాను చేసిన పాపం కారణంగా యావత్ సృష్టినీ శాపగ్రస్తం చేశాడు, చేజేతులా మృత్యువును కొని తెచ్చుకున్నాడు.

కానీ "నూతన ఆదాము" యేసుక్రీస్తు ప్రభువు తన మరణ పునరుత్థానాల ద్వారా లోకానికి నవజీవాన్ని ప్రసాదించారు.

**రెండవది:** తాను మృత్యువును జయించి, నిత్య జీవాన్ని సాధించి, మోక్షారోహనుడు కావడం ద్వారా క్రీస్తు ప్రభువు ముల్లోకాలనేలే రారాజుగా వర్ధిల్లగలుగుతున్నారు. నేడు మనం ఆ క్రీస్తురాజు పాలనలోనే మనుగడ సాగిస్తున్నాం.

అయితే క్రీస్తు తరాజ్యంలో క్రీస్తురాజు పాలనలో సర్వత్రా శాంతి సమాధానాలు విలసిల్లుతాయని చెప్పలేము. క్రీస్తు రాజ్యంలో నిత్యమే నైతిక యుద్ధాలు ఆధ్యాత్మిక ఘర్షణలు జరుగుతూ ఉంటాయి. క్రీస్తు విశ్వాసులకు పౌలు పేర్కొన్న అగోచర శక్తులకూ మధ్య సదా ఘర్షణ జరుగుతూనే వుంటుంది. కానీ, ఈ ఘర్షణలను చూచి క్రైస్తవులు భీతిల్లనవసరం లేదు. ఎందుకంటే క్రీస్తుప్రభు రాచరికం రాజ్యాధికారం వారిని శక్తిమంతులను చేస్తుంది, శత్రువులను వారికి పాదాక్రాంతులను చేస్తుంది.

**మూడవది:** ఇలా క్రీస్తు శిష్యులకు అగోచరమైన శత్రువులకు మధ్య జరిగే నైతిక యుద్ధం ముగిశాక, పరాజితులైన శత్రువులంగా క్రీస్తు రాజ్యానికి దాసులయ్యాక క్రీస్తు రాజు తన రాజ్యాన్ని తండ్రి దేవునికి కానుకగా సమర్పిస్తారు. అప్పుడు లోకమంతా దేవుని ఆధీనంలోనికి వస్తుంది. అప్పుడు అంతటా అన్నిటా దేవుని చల్లని పాలన కొనసాగుతుంది.

ఇలా ఈ పఠనం ద్వారా మనం క్రీస్తు ప్రభువు ఏవిధంగా రాజయ్యారో క్రైస్తవులు ఆయన రాజరికాన్ని ఏవిధంగా కనుగొనగలుగుతారో, ఆయన రాజరికాన్ని పుణికి పుచ్చుకున్న క్రైస్తవులు కడకు ఏం సాధించగలుగుతారో తెలుసుకోగలుగుతాం. మరోమాటలో చెప్పాలంటే క్రీస్తురాజు పాలనలోను క్రైస్తవులు తమ శత్రువులందరిపైన అంతిమ విజయాన్ని సాధించగలుగుతారు.

## సువార్త పఠనం: మత్తయి 25:31-46

ఈనాటి సువార్త పఠనంలో మనం "తుదితీర్పు" గురించి చదువుతున్నాం. యేసుక్రీస్తు రెండవ రాక కోసం క్రైస్తవ విశ్వాసులు ఓపికతో ఎదురు చూడాలని బోధించే మూడు ఉపమానాలునమ్మని బంటు, పదిమంది కన్యలు. వరహాలు (తాలెంతుల) ఉపమానం తరువాత "తుదితీర్పు" ప్రస్తావన వస్తుంది. ఈ పఠనంలో మనం "తుదితీర్పు" ఘట్టాన్ని కళ్ళకు కట్టినట్టు దర్శించగలుగుతాం.

అయితే ఇక్కడ మనం గమనించవలసిన కొత్త విశేషాలు రెండున్నాయి. అవేమిటంటే ఇప్పటి వరకూ మనం చెప్పుకున్నట్టు ఈ "తుదితీర్పు" లోకంలోని సకల జాతుల వారికి దేవుడు చెప్పే తీర్పుకాదు. ఇది శ్రీసభలో సభ్యులైన విభిన్న జాతుల విశ్వాసులకు ప్రభువిచ్చే తీర్పు. అవును. ఇది అన్యజాతులకు ఇచ్చే తీర్పుకాదు, శ్రీసభలో సభ్యులైన క్రైస్తవులకు మాత్రమే ఇవ్వబోయే తీర్పు. అలాగే ఈ తుది తీర్పుకు ప్రమాణాలు పేదలకు దీనులకు మానవతా దృక్పథంతో చేసే సేవలు కాదు. ఇది క్రీస్తు రాజు పాలనలో తండ్రి సంకల్పానుసారం క్రైస్తవులు చేసే "నీతి కార్యాలు"

ఇక ఈనాటి సువార్త పఠనంలోని వివరాలలోనికి వెళ్ళే ముందుగా ఇందులోని 24,40,45 వచనాలు ఈ పఠనంలోని ప్రధాన భావాలను అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తాయి. 40వ వచనంలో యేసుప్రభువు పలికిన మాటలను గమనించండి .."ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినపుడు అవి నాకు చేసితిరి.." ఇక్కడ "ఒకరికి చేసిన ఉపకారం గానీ అపకారం గానీ మరొకరికి చేసినట్టవుతుంది" అనే భావం యూదులకు "షాలియక్" అనే చట్టాన్ని గుర్తు చేస్తుంది. ఈ "షాలియక్ చట్టం" ప్రకారం

"మనకు ఏదైనా కబురు చెప్పడానికి గానీ మరేదైనా పనిమీదగానీ ఎవరైనా పంపగా వచ్చిన ప్రతినిధిని మనం నిరాదరించి అవమానిస్తే అది దక్కుతుంది ఒకవేళ ఆ ప్రతినిధిని మనం నిరాదరించి అవమానిస్తే, అది ఆ ప్రతినిధిని పంపిన వ్యక్తిని అవమానించినట్లే అవుతుంది". ఇదే వాక్య నిర్మాణం మనకు యేసు పలికిన "తుది తీర్పు" లోనూ కనిపిస్తుంది. నిజానికి "షాలియక్" చట్టానికి వర్తించే నియమమే క్రైస్తవ విశ్వాసులకు క్రీస్తురాజు చెప్పబోయే తుది తీర్పుకూ వర్తిస్తుంది.

దీని ప్రకారం శ్రీసభ ఈ లోకంలో ప్రభువు పంపిన ప్రతినిధి కాగా ప్రతినిధిని పంపిన వ్యక్తి క్రీస్తుప్రభువు. కనుక శ్రీసభను సాదరంగా స్వీకరించి, శ్రీసభ ప్రబోధాలను నిష్ఠగా పాటించేవారు సాక్షాత్తు క్రీస్తు ప్రభువును స్వీకరించి ఆయన ప్రబోధాలను పాటించిన వారవుతారు అలాగే శ్రీసభను నిరాకరించి శ్రీసభ ప్రబోధాలను నిర్లక్ష్యం చేసేవారు సాక్షాత్తు క్రీస్తుప్రభువునే నిరాకరించి ఆయన సందేశాలను నిర్లక్ష్యం చేసినవారవుతారు.

ఇలా శ్రీసభను నిరాదరించి, శ్రీసభ సువార్తా ప్రబోధాలను నిర్లక్ష్యం చేస్తూ "శ్రీసభ ఆదేశాల ప్రకారం నడువడానికి ముందుకు రానివారు అంతిమ తీర్పులో ప్రభు ఆగ్రహానికి గురవుతారు. ఎందుకంటే శ్రీసభను ధిక్కరించిన వారు, ప్రభువునూ ధిక్కరించిన పాపాన్ని మూటగట్టుకున్న వారవుతారు. ఇదే సందేశం మార్కు, లూకా సువార్తల్లోని ఇతర సందర్భాల్లో కూడా వ్యక్తమవుతోంది. ఉదాహరణకు "ఇట్టి చిన్న బిడ్డలలో ఒకనిని నా పేరిట స్వీకరించువాడు, నన్ను స్వీకరించినవాడగును.." (మార్కు 9:37). "మిమ్ము క్రీస్తు సంబంధులుగా గుర్తించి, ఎవ్వడు మీకు చెంబెడు నీళ్ళు ఇచ్చునో, వాడు తగిన ప్రతిఫలము తప్పక పొందును". "నన్ను మనుష్యుల ఎదుట అంగీకరించువానిని మనుష్యకుమారుడు కూడా దేవదూతల ఎదుట అంగీకరించును". "ఇది పాపిష్టితరము నన్ను గూర్చి నా సందేశమును గూర్చి సిగ్గుపడుచున్నది..". ఇవన్నీ కూడా "షాలియక్" చట్టాన్ని పోలిన ప్రబోధాలేనన్న సత్యాన్ని మనం గుర్తించాలి. అలాగే "తుదితీర్పు" అంతరార్థాన్ని శ్రీసభ స్పష్టంగా బోధించాలి. విశ్వాసులకు సత్యాన్ని ప్రబోధిస్తూ వారు సువార్తా విలువలకు శ్రీసభ ప్రబోధాలకు నిబద్ధులై పవిత్ర జీవనం గడపడానికి దోహదం చేయాలి, తుదిదీర్పు నాడు వారు దేవుని ఎదుట దోషులుగా నిలువకుండా కాపాడాలి.

ఇకపోతే ఈ తుదితీర్పు ఘట్టంలోనే న్యాయాధీశుడైన క్రీస్తుప్రభువు తన కుడి ప్రక్కన ఉన్నవారితో ఇలా అంటారు. "నా తండ్రిచే దీవింపబడిన వారలారా, రండు... మీకై సిద్ధపరచబడిన రాజ్యమును చేకొనుడు". ఈ మాటను బట్టి ప్రభువుకు కుడి ప్రక్కన ఉన్న వాళ్ళు తండ్రి దేవుని దీవెనలు పొందినవారు కనుక, వారు అప్పటికే మంచి పనులు చేసి ఉంటారని అనుకోవచ్చు. అయితే దేవుని సంకల్పానుసారం పవిత్రాత్మ శక్తితో చేసే పనులు

కేవలం "మంచి పనులు" మాత్రమే కావనీ, అవి "పవిత్రకార్యాలు" కూడా అవుతాయని తెలుసుకోవాలి. దీనినిబట్టి తుదితీర్పులో దేవుని ఎదుట నిలచేవారు శ్రీసభ సభ్యులైన క్రైస్తవులేనని అన్యులుకారని స్పష్టమవుతుంది.

అవును. ఇంతకుముందే చెప్పుకున్నట్టు "తుదితీర్పు" లోకంలోని అన్యజనులకు సంబంధించినది కాదు, ప్రపంచ శ్రీసభలో ఉన్న విభిన్న జాతుల విశ్వాసులకు సంబంధించినది. శ్రీసభకూ తద్వారా క్రీస్తు ప్రభువు విధేయులై పవిత్రజీవనం గడపిన విశ్వాసలు ఒకపక్క, అవిధేయులైన విశ్వాసులు మరోపక్క నిలచి ఉండగా, ప్రభువు నిర్వహించే "అంతిమ న్యాయతీర్పు" అది.

కనుక "తుదితీర్పు" గురించి ప్రసంగించే గురువులు శ్రీసభలో సభ్యులైన క్రైస్తవులు నిర్వర్తించ వలసిన పవిత్రకార్యాల గురించీ, నీతికార్యాల గురించీ బోధించాలే తప్ప కేవలం లౌకికమైన సాంఘీక సేవలే "తుదితీర్పు" నాడు పరమ ప్రమాణాలవుతాయనే అపోహలను కల్పించరాదు. జ్ఞానస్నానం ద్వారా తండ్రి దేవుని ఆశీస్సులు పొంది, క్రీస్తుప్రభువు రాజధర్మంలో భాగస్తులైన క్రైస్తవులు సదా పవిత్రాత్మ సహాయాన్ని పొందుతూ దేవుని చిత్తప్రకారం దేవుని ఆత్మ ప్రేరణకనుగుణంగా పవిత్ర కార్యాలు ఆచరిస్తూ పవిత్ర జీవనం గడపాలి.

ఇలా ఈనాటి సువార్తా పాఠానికి యథార్థమైన అర్థాన్ని స్పష్టంగా బోధించగలిగినపుడే క్రైస్తవేతరులకు క్రీస్తుప్రభువు రాజధర్మ ప్రాధాన్యం, శ్రీసభ సభ్యత్వానికి గల ప్రాముఖ్యం బోధపడతాయి, వారు సైతం 'క్రీస్తురాజ్య" ప్రవేశాన్ని కోరుతూ కదలి రాగలుగుతారు.

## ముగింపు

నీతిమంతులు రక్షింపబడుతారు, అవినీతిపరులు దేవుని శిక్షకు గురవుతారు. ఇది మన విశ్వాసం, నిరీక్షణ కూడా. "క్రీస్తురాజు మహోత్సవం" నాడు న్యాయాధీశుడైన క్రీస్తు ప్రభువు చెప్పబోయే "అంతిమతీర్పు" గురించి మనం ధ్యాపూర్వకంగా ఆలోచించాలి. ఆ గడియ ఎప్పుడు వచ్చినా మనం సిద్ధంగా ఉండాలి. ప్రభు క్రీస్తురాజు విధించిన అంతిమ తీర్పు ప్రమాణాల ప్రకారం మన ఆలోచనల్లో, మాటల్లో మేలైన మార్పులు తెచ్చుకోవాలి, మన బ్రతుకుబాటల్ని సవరించుకోవాలి!

# బైబిలు ప్రశ్నలు - సమాధానాలు

## 3. బైబిలు మనచేతికి వచ్చిన పరిణామ క్రమమేమిటి?

బైబిలులోని ప్రాచీన గ్రంథాలు మొదట మౌఖిక సాంప్రదాయంగా అందించబడినాయి. (Oral tradition) ఆ తరువాతే లిఖించబడినాయి. (Writen tradition) ఒక పాటనో లేక సంభాషణనో దైవ ప్రేరణతో సమకూర్చిన రచయిత, దానిని నోటిమాటలో ఇతరులకు అందించాడు. ఇతరులు దానిని పదేపదే వల్లెవేసుకున్నారు. ఇదికొన్ని వందల సంవత్సరాలుగా జరిగింది. ప్రబోధనలు చిన్నచిన్న వచనాలుగా, పాటలుగా రచింపబడినాయి. ఎందుకంటే కంఠతా నేర్చుకొని పాడుకోవడానికి అవి అనువుగా ఉంటాయి. కాబట్టి ప్రజలు వాటిని గుర్తుంచుకొని పాడుకొనడం లేదా ఉచ్చరించడం ద్వారా వారి జ్ఞాపకశక్తి కూడా పెరుగుతూ వచ్చింది. ఈ ప్రకారంగా బైబిలు గ్రంథం మొదట మౌఖిక సాంప్రదాయంలోనే వచ్చింది. సాంప్రదాయం అంటే ఇక్కడ, అది ఇతరులకు అందించబడిన విధానము అని అర్థం చేసుకోవాలి. బైబిలు గ్రంథాలు అక్షరరూపం దాల్చకమునుపు, సంభాషించడినాయి, మాట్లాడబడినాయి. పూర్వగ్రంథ విషయంలో, వ్రాయటానికి ఉపక్రమించిన రచయిత ఎవరో ఒకరి దగ్గర నుండి విన్నాడు. ఆ ఒక్కరు ఇంకొకరి దగ్గర నుండి విన్నారు. ఇలా కర్ణాకర్ణిగా వ్యాపించిన దైవవాక్యం, చివరికి అక్షర రూపంలో స్థిరపడింది. పితృ స్వామిక సమాజంలో తండ్రులు, తాతలు, ముత్తాతలు, తమ పిల్లలకు తమ వారసత్వ సంపదను వివరించేవారు. ఇలా పరంపరా గతంగా వచ్చిన తమ వారసత్వ సంపదను వివరించేవారు. ఇలా పరంపరాగతంగా వచ్చిన తమ పూర్వీకులు చరిత్రను తలచుకొని ఉప్పొంగిపోతూ, ముందుతరాలకు అందించేవారు. అలా సంరక్షింపబడ్డ రక్షణ చరిత్ర, అక్షరాల ఊపిరి పోసుకున్న తరువాత, ప్రత్యక్షంగా అక్షర రూపంలో మనుషుల ముందు కొచ్చింది. వాటినే హస్త ప్రతులు (Manuscripts) అంటాము. కాలక్రమేణ, జీవన స్రవంతిలో మార్పులు, సమాజశ్రేయస్సును బట్టి రచయితలు చేసిన మార్పులు జరిగినా, మౌళిక సందేశం మాత్రం ఎప్పటికీ మారలేదు. ఈ విధానం క్రీస్తు కాలంలోను, ఆ తరువాత

కూడా కొనసాగింది. క్రీ.శ. 15వ శతాబ్దంలో ముద్రణాయంత్రాన్ని కనుగొన్న తరువాత, దైవవాక్యం గ్రంథ రూపంలో దర్శనమిచ్చింది. అంతకుముందు మూడు రకాలుగా దేవుని వాక్యం పరిరక్షించబడింది.

**1. జంతు చర్మ చుట్టలు** (Scrolls) : జంతు చర్మాన్ని వ్రాయటానికి అనుకూలంగా మార్చుకొని, దాని మీద వ్రాసి, ఒక కర్రచుట్టు చుట్టి భద్రపరిచేవారు. ఈ విధానం క్రీ.పూ. 1వ శతాబ్దంలో ప్రముఖంగా కనిపిస్తుంది. ఈ చుట్టలను 1947- 1950 వ సంవత్సరకాలంలో మృతసముద్ర ప్రాంతంలో గల 'కుమ్రాన్' అనే గుహలలో కనుగొన్నారు. (Qumran Caves)

**2. తాళపత్రాలు** (Papyrus): ఈజిప్టు దేశంలో వెడల్పుగా వుండే తాటి చెట్టు మట్టలను వ్రాయడానికి ఉపయోగించేవారు. ఎండిన మట్టలను ఒకటిగా కొట్టి, ఎండబెట్టి వ్రాయడానికి అనుకూలంగా మలచేవారు. ఈ పద్ధతి మనదేశంలో కూడా ఆచరించినట్లు గమనించాలి. నూతన నిబంధన ఈ విధానంలోనే సంరంక్షించబడింది.

**3. ప్రాచీన వ్రాత ప్రతులు** (Codices): ఎండిన జంతుచర్మాని పలుచగా చేసి, రెండురెండుగా జతచేస్తూ, వ్రాయడానికి అనువుగా మలచేవారు. వీటిమీద వ్రాసిన అనేక ప్రముఖమైన గ్రంథాలు, వ్రాతప్రతులను క్రైస్తవ శ్రీసభ కాపాడుకోగలిగింది. అతి ప్రాచీనమైన గ్రీకు బైబిలు ఆసాంతం, ఈ విధంగా సంరక్షించబడిందే. వీటిలో ప్రముఖమైనవి వ్రాతప్రతులు, Codex Vaticanus, Codex Sinaiticus Codex Alexandrinus అనునవి.

## 4. బైబులు ఎందుకు చదవాలి ?

పరిశుద్ధత్మా చేత ప్రేరేపించబడినది కావున, సాక్షాత్తు బైబిలు, దేవుని వాక్యము. అందులోని గాఢతను, నిక్షిప్తమైన ఆధ్యాత్మికనిధులను తెలుసుకొమ్మని అది పాఠకులను ప్రేరేపిస్తుంది. బైబిలు అందరికి, అన్ని సందర్భాలలో, అన్ని సమయాలలో, అన్ని ప్రదేశాలలో ఏదొక ప్రేరణను, శక్తిని కలిగిస్తుంది. ఉదాహరణకు ఈ క్రింది వచనాలు చదవండి:

| | | |
|---|---|---|
| **ప్రమాదకర పరిస్థితులలో** | **-** | **కీర్తనలు 16,31,38, 2 పేతు 2:9** |
| **అధైర్యపడినపుడు** | **-** | **కీర్త 23,37:1-17** |
| **వ్యాధిబాధలలో** | **-** | **మత్త 26:39 2 తిమో 2:3 యాకో 5:11-15** |
| **భయముకలిగినపుడు** | **-** | **హెబ్రీ 12:1-2, మత్త 10:16-31** |

1. ప్రపంచంలో కొట్లాది ప్రజలకు ప్రేరణ కలిగించి, సన్మార్గానికి దారి చూసి దైవ గ్రంథం బైబిలు.
2. బైబిలును ఆధ్యాత్మిక పరిపుష్టికి, విషయ పరిజ్ఞానానికి జ్ఞాన సముపార్జనకు, సత్ప్రవర్తనా బోధన కోసం, మంచి చెడుల నైతిక జీవన విధానం కోసం చదవాలి. మనిషి కోసం దేవుడు పొందుపరచిన ఆజ్ఞలు అందులో వివరించబడి ఉన్నాయి.
3. దేవుని వాక్యాన్ని విశ్వసించడమంటే నిత్యజీవాన్ని పొందినట్లు (యోహా 4:1-24)
4. బైబులు మనకంటె ముందువెళ్ళిన పితామహుల చారిత్రక కథా సంకలనం. వారిని దేవుడు కష్ట సమయాల్లో కూడా నిత్యసంతోషానికి నడిపిన తీరు అందులో నిక్షిప్తమై ఉంది. అది దేవునికీ మధ్య జరిగిన ఒప్పందాలను, అవి మన పితాపుత్రుల నుండి మనకు సంక్రమించే తీరును వివరిస్తుంది.
5. బైబిలుయెడల అజ్ఞానము, దేవుని యెడల అజ్ఞానానికి దారి తీస్తుంది అంటారు, పునీత జెరోమ్‌గారు. బైబులును పఠించకపోతే దేవుని గురించి తెలుసుకోలేం. దేవుడులేని జీవితం గాలి లేని బుడగలాంటిది, జీవంలేని శరీరంలాంటిది. దైవవాక్య పరిజ్ఞానం లేని వారికి దైవసాన్నిధ్యం కూడా దుర్లభమే!

## జ్యోతిర్మయి బైబిలు పరీక్ష:

ఆంధ్రప్రదేశ్ జ్యోతిర్మయి సంస్థ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న బైబిలు పరీక్ష, ఈ సంవత్సరం నవంబరు 5వ తారీఖు అనగా ఆదివారం, విచారణ కేంద్రాలలో, విచారణ గురువుల పర్యవేక్షణలో జరుగుతుంది. కేటగిరీల ప్రకారం ప్రశ్నాపత్రాలు ది. 4 నవంబరు, పరీక్ష జరిగే ముందురోజు అనగా శనివారం సాయంత్రానికి విచారణ గురువులకు అందజేయబడతాయి. **విచారణ గురువులకు మనవి:** నవంబరు5, ఆదివారం మీ అనుకూలతను బట్టి సాయంత్రం 5 గం॥ లలోపు పరీక్షను నిర్వహించగలరు. సోమవారం పాస్టరల్ సెంటర్ తరుపున వచ్చే సంబంధిత ఉపదేశి గారికి పరీక్షా పత్రాలను అందజేయగలరు.

## మౌళిక సంఘం -అల్లూరుపాడు (వత్సవాయి విచారణ) 2017 సాధించిన విజయాలు:

- మేకల పుల్లారావు గారు మౌళిక సంఘంను ఉద్దేశించి చర్చికి కుటుంబ సమేతంగా **10,000 రూ॥లు** సమర్పించినారు.
- జంగం శ్రీను గారు సువార్తా ప్రార్థనల్లో పాల్గొనటానికి వచ్చే సభ్యులకు 10 మోక్షద్వారము పాటల పుస్తకాలను ఇచ్చినారు మరియు చర్చి నందు ఉన్న మైక్‌ను రిపేర్ చేయించినారు, అందుకు అయిన ఖర్చు కేవలం **300/-**

– ఎ. ఆదాం, ఉజ్జీవకుడు.

## ఉపదేశుల సదస్సు:

ది. 27 నవంబరు 2017 అనగా సోమవారం పాస్టరల్ సెంటరు నందు ఉపదేశులకు సదస్సు జరుగుతుంది. ఈ సదస్సును ఆంధ్రప్రదేశ్ జ్యోతిర్మయి సంస్థ రీజనల్ సెక్రటరి రెవ.ఫా.యం. సాల్మన్ రాజుగారు మరియు వారి బృందం నిర్వహిస్తారు. ఈ సదస్సుకు ప్రతి విచారణ నుండి ఒక ఉపదేశి (Trained or Professional) తప్పని సరిగా పాలు పంచుకోవాలని ఉపదేశులకు విజ్ఞప్తి. సదస్సు జరుగు సమయం ఉదయం గం॥ 10 నుండి సా॥ 4 గం॥ వరకు.

# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| ఆర్. రవికుమార్ | ముసునూరు | 02-11-1955 | 9949330861 |
| పి. భాస్కరరావు | మచిలీపట్నం | 04-11-1957 | ---------- |
| వి. రమేష్ | చనుబండ | 05-11-1981 | 9010986521 |
| యమ్. జాన్ సురేష్ | బంటుమిల్లి | 05-11-1985 | 9704258939 |
| కె. ప్రసన్నరాజు | గన్నవరం | 06-11-1960 | 9440581960 |
| జి. అంతోని | భైరవపట్నం | 06-11-1970 | 9177119460 |
| యమ్. మరియన్న | కలిదిండి | 07-11-1948 | 9959947334 |
| యమ్. కాంతారావు | కంకిపాడు | 08-11-1964 | 9000427419 |
| వి. విజయ బాలస్వామి | ముస్తబాదా | 08-11-1963 | 8985151182 |
| జె. జోజి ప్రకాష్ | వణుకూరు | 09-11-1975 | 9703382646 |
| కె. క్రీస్తురాజు | కొండపల్లి | 10-11-1982 | 9849211355 |
| జె. బెంజిమెన్ | జీవన్ గనర్ | 10-11-1980 | 9963082956 |
| కె. జాన్‌త్రో | భాస్కరరావుపేట | 10-11-1978 | ---------- |
| బి. సుందరరావు | పెడన | 10-11-1973 | 9989524979 |
| యస్. ఆంద్రేయ | కంచికచర్ల | 12-11-1947 | 9618362086 |
| పి. జయరాజు | గుడ్లవల్లేరు | 12-11-1963 | 9618326098 |
| కె. క్రిష్టోఫర్ | ఆర్.ఆర్. పేట | 13-11-1966 | 9399986418 |
| పి. ఏలియా | తేలప్రోలు | 14-11-1967 | 9440139179 |
| వి. రమేష్ | ఉప్పులూరు | 15-11-1985 | 9010986521 |
| టి. యేసురత్నం | చల్లపల్లి | 15-11-1965 | 9849334283 |
| జి. ప్రకాష్ | ఉయ్యూరు | 15-11-1966 | ----------- |
| టి. సాల్మన్ | కోడూరు | 16-11-1978 | 8019820768 |
| యమ్. చార్లెస్ | ముదినేపల్లి | 18-11-1962 | 9059040494 |
| కె. జోసఫ్ | గుడ్‌మన్‌పేట | 19-11-1977 | 9908873993 |
| డి. గాబ్రియేలు | రమణక్కపేట | 21-11-1967 | 9533685144 |
| ఆర్. యోహోను | ఆరుగొలను | 25-11-1987 | 7093583856 |
| ఎ. సతీష్ బాబు | కోడూరు | 26-11-1977 | 9553885602 |
| డి. రాజు | అవనిగడ్డ | 26-11-1977 | 7013293782 |
| యమ్. అర్జునరావు | ఉప్పులూరు | 30-11-1977 | 9014326759 |
| యమ్. రాజారావు | ముదినేపల్లి | 30-11-1983 | ----------- |